UDYAM-TS-02-0308842 www.prathighatana.com

# ప్రతిఘటన

తెలుగు దిన పత్రిక జనం కోసం..

హైదరాబాద్ | సంపుటి : 1 | సంచిక : 30 | పేజీలు : 8 | బుధవారం 25 ఫిబ్రవరి 2026 | వెల : 4/-

# వనం వీడి జనంలోకి..








- నలుగురు మావోయిస్టు అగ్రనేతలు లొంగుబాటు
- లొంగిపోయిన వారిలో కేంద్రకమిటీ కార్యదర్శి దేవ్ జీ, పోలిట్‌బ్యూరో సభ్యుడు మల్లా రాజిరెడ్డి
- తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి బడే చొక్కారావు, రాష్ట్ర కమిటీ సభ్యుడు నూనె నర్సింహారెడ్డి
- తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో లొంగుబాటు
- నలుగురిపై రూ.90 లక్షల రివార్డు
- దశాబ్దాల అజ్ఞాత జీవితానికి స్వస్తి పలికిన మావోయిస్టులు

ప్రతిఘటన , హైదరాబాద్

మావోయిస్టు పార్టీకి చెందిన అగ్రనేతలు తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి ఎదుట లొంగిపోయారు. ఇందులో ఇద్దరు కేంద్రకమిటీ సభ్యులు కాగా మరో ఇద్దరు తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు. ఇద్దరు కేంద్ర కమిటీ సభ్యులపై తలా రూ.25 లక్షల రివార్డు ఉండగా, మరో ఇద్దరు రాష్ట్రకమిటీ సభ్యులపై తలా రూ.20 లక్షల రివార్డు ఉన్నది. నలుగురూ ఒకేసారి లొంగిపోవడంతో తెలంగాణకు చెందిన లీడర్లు ప్రస్తుతం మావోయిస్టు పార్టీలో ఇద్దరే ఉన్నారని డీజీపీ తెలిపారు. లొంగిపోయినవారిలో కేంద్ర కమిటీ కార్యదర్శి తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ, పోలిట్‌బ్యూరో సభ్యుడు మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్, తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి బడే చొక్కారావు అలియాస్ దామోదర్ , రాష్ట్ర కమిటీ సభ్యుడు నూనె నర్సింహారెడ్డి అలియాస్ గంగన్న ఉన్నారు.

**దశాబ్దాల అజ్ఞాత జీవితానికి స్వస్తి :** జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణానికి చెందిన తిప్పిరి తిరుపతి అలియాస్ - మిగతా3లో




- కేంద్ర కేబినెట్‌లో కీలక నిర్ణయాలు
- 'సేవా తీర్థ్' నుంచి దేశాభివృద్ధికి సరికొత్త శక్తి
- కేరళ రాష్ట్రం పేరు మార్పునకు గ్రీన్ సిగ్నల్
- త్వరలోనే పార్లమెంటులో బిల్లు
- రూ. 9,072 కోట్లతో రైల్వే మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులు
- శ్రీనగర్ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధికి రూ.1,677 కోట్లు
- గుజరాత్ మెట్రో విస్తరణకు ఆమోదం
- జనపనార మద్దతు ధర పెంపు
- క్వింటాల్‌కు రూ. 5,925గా నిర్ణయం

ప్రతిఘటన, హైదరాబాద్

మంగళవారం ఢిల్లీలోని 'సేవా తీర్థ్'లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన తొలి కేబినెట్ సమావేశంలో ప్రభుత్వం కీలకమైన 'సేవా సంకల్ప' తీర్మానాన్ని ఆమోదించింది. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చడమే లక్ష్యంగా, పౌర కేంద్రీకృత పాలనను అందించడమే తమ ప్రాధాన్యమని కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. 'నాగరిక్ దేవో భవ' స్ఫూర్తితో 140 కోట్ల మంది పౌరుల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రతి నిర్ణయం ఉంటుందని ప్రభుత్వం పునరుద్ఘాటించింది. అలాగే, త్వరలోనే ప్రపంచంలోని మొదటి మూడు ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా భారత్‌ను నిలబెడతామని తీర్మానించింది.

**కేరళ పేరు మార్పునకు ఆమోదం**

కేరళ రాష్ట్రం పేరును 'కేరళం'గా మారుస్తూ పంపిన ప్రతిపాదనకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ ప్రక్రియలో భాగంగా రాష్ట్ర శాసనసభ అభిప్రాయం కోరుతూ భారత రాష్ట్రపతి 'కేరళ (పేరు మార్పు) బిల్లు, 2026'ను పంపనున్నారు. అసెంబ్లీ అభిప్రాయం అందిన తర్వాత, పార్లమెంటులో తుది బిల్లును - మిగతా3లో

## తమిళనాట కొత్త పార్టీ..



- జయలలిత జయంతి రోజే చిన్నమ్మ సంచలన ప్రకటన
- అన్నాదురై.. ఎంజీఆర్.. జయలలిత బాటలోనే తమ పార్టీ పయనం
- శశికళ ఎంట్రీలో తమిళనాడులో మారనున్న రాజకీయ సమీకరణలు

3

## నేటి నుంచి ఇంటర్ పరీక్షలు షురూ..



- పకడ్బందీ ఏర్పాట్లు చేసిన ఇంటర్మీడియట్ అధికారులు
- గంట ముందే ఎగ్జామ్ సెంటర్లకు చేరుకోవాలి
- ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు..
- పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలతో నిఘా

ప్రతిఘటన, హైదరాబాద్

నేటి నుంచి మార్చి 18 వరకు ఇంటర్ పరీక్షల జరగనున్న నేపథ్యంలో అధికారులు నిర్వహణ ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇంటర్మీడి యట్ వార్షిక పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనున్నాయి.ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు ఫిబ్రవరి 27 నుంచి మొదలవుతాయి. మొత్తం రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 9.9 లక్షల మంది విద్యార్థులు ఈ ఏడాది ఇంటర్మీడియట్ పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ఐపీఈ) - మిగతా3లో

## దేశవ్యాప్తంగా ఉచితంగా 'హెచ్‌పీవీ' వ్యాక్సిన్

- క్యాన్సర్ రహిత భారత్ లక్ష్యంగా కేంద్రం ముందడుగు
- 14 ఏళ్లు పైబడిన బాలికలకు ఉచితంగా 'గార్డాసిల్' ఇంజెక్షన్
- నాలుగు రకాల ప్రమాదకర వైరస్‌ల నుంచి రక్షణ
- సింగిల్ డోస్‌తోనే దీర్ఘకాలిక భద్రత
- సామాన్యులకు అందుబాటులోకి రూ.3,927 ధర ఉన్న టీకా
- క్యాన్సర్ మరణాల్లో భారత్ మూడో స్థానం
- 2040 నాటికి 20 లక్షల కేసులు పెరుగుతాయనే ఆందోళన



## టెన్త్, ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా బస్సు ప్రయాణం

హాల్ టికెట్ చూపించి ఫ్రీ జర్నీ చేయవచ్చు

పరీక్షల సమయంలో ప్రత్యేక బస్ సర్వీసులు

అధికారులను ఆదేశించిన మంత్రి పొన్నం ప్రభాకర్

ఆర్టీసీ బస్సు ఆపరేషన్స్ పై సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష






## తల్లా..రాక్షసినా?

- కాళ్లు, చేతులు కట్టేసి.. నోట్లో గుడ్డలు కుక్కి..
- రెండు నెలల బాబును కట్టెల పొయ్యిలో వేసి హత్య
- బాబు రోజు ఏడుస్తున్నాడని ఘాతుకం
- మహారాష్ట్ర నుంచి జీవనోపాధికి వచ్చిన ఫ్యామిలీ
- మేడ్చల్ జిల్లా దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఘటన



## ప్రజల కన్నీళ్లపై స్మారక చిహ్నాలు తగదు

- అభివృద్ధి పేరుతో సామాన్యులను ఇబ్బందులు పెట్టవద్దు
- గాంధీ ఆశయాలకు విలువిస్తూ ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోండి
- "గాంధీ ఈరోజు బ్రతికి ఉన్నా.. నా పేరుతో ఇలాంటి పనులు వద్దని ఖచ్చితంగా చెప్పేవారు"
- కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ గాంధీ మునిమనవడు తుషార్ గాంధీ ట్వీట్

2లో



## మావోయిస్టు మాజీ చీఫ్ గణపతి ఎక్కడ ?

అనారోగ్యంతో నేపాల్‌లో షెల్టర్ తీసుకున్నారా..?

మిగిలిన అగ్రనేతలు వివిధ రాష్ట్రాల్లో మకాం

టాప్ ర్యాకింగ్ నేతలు లొంగిపోతే మావోయిస్ట్ పార్టీ శకం ముగిసినట్టే..

2



## ఒకే కుటుంబంలో ముగ్గురు ఆత్మహత్య

- ఉరేసుకున్న తండ్రి, తల్లి, కుమారుడు
- ఆర్థిక ఇబ్బందులే కారణమా?
- సూసైడ్‌కు ముందు మిత్రుడికి వాట్సప్ మెసేజ్
- అంబర్‌పేట్ లో తీవ్ర కలకలం రేపిన బలవన్మరణాలు

3

## తమిళనాట కొత్త పార్టీ..

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ముంగిట రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. అన్నాడీఎంకే బహిష్కృత నేత వీకే శశికళ రాష్ట్ర రాజకీయాల్లో కొత్త పార్టీని స్థాపించబోతున్నట్లు సంచలన ప్రకటన చేశారు. రామనాథపురంలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో ఆమె ఈ మేరకు స్పష్టతనిచ్చారు. దివంగత తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత జయంతిని పురస్కరించుకుని ఈ కీలక ప్రకటన చేయడం తమిళనాట చర్చనీయాంశంగా మారింది. జయలలిత ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే తన ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా శశికళ స్పష్టం చేశారు.తమ నూతన పార్టీ అన్నాదురై.. ఎంజీఆర్.. జయలలిత వంటి మహోన్నత నాయకులు చూపిన బాటలోనే పయనిస్తుందని ఆమె వెల్లడించారు. పేదలు.. అణగారిన వర్గాలు.. సామాన్య ప్రజల అభ్యున్నతి కోసం తమ పార్టీ నిరంతరం శ్రమిస్తుందని హామీ ఇచ్చారు. అన్నాడీఎంకేలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో ఆమె సొంత కుంపటి పెట్టాలని నిర్ణయించుకోవడం ఆ పార్టీకి పెద్ద దెబ్బగానే భావిస్తున్నారు. జయలలిత వారసత్వాన్ని తానే కొనసాగిస్తానని ఆమె పరోక్షంగా ఈ సభ ద్వారా సంకేతాలు పంపారు. శశికళ రాజకీయ ప్రవేశం తమిళనాడులోని ద్రవిడ రాజకీయాల్లో కొత్త ప్రకంపనలు సృష్టిస్తోంది. రాబోయే ఎన్నికల్లో అన్నాడీఎంకే ఓటు బ్యాంక్‌ను శశికళ పార్టీ ఏ మేరకు ప్రభావితం చేస్తుందనేది ఆసక్తికరంగా మారింది. క్షేత్రస్థాయిలో ఉన్న కేడర్ మద్దతును కూడగట్టుకునేందుకు ఆమె ఇప్పటికే కసరత్తు ప్రారంభించారు. జయలలిత స్నేహితురాలిగా సుదీర్ఘ కాలం రాజకీయాల్లో తెర వెనుక చక్రం తిప్పిన శశికళ.. ఇప్పుడు నేరుగా ప్రజాక్షేత్రంలోకి రావడం ద్వారా తన బలాన్ని నిరూపించుకోవాలని చూస్తున్నారు. ఈ పరిణామం అటు అధికార డీఎంకేతో పాటు ఇటు అన్నాడీఎంకేను కూడా ఆలోచనలో పడేసిందని విశ్లేషకులు చెబుతున్నారు.

## ప్రజల కన్నీళ్లపై స్మారక చిహ్నాలు తగదు: తుషార్ గాంధీ

ప్రతిఘటన, హైదరాబాద్

మూసీ నది ఒడ్డున గాంధీ విగ్రహం ఏర్పాటు చేయాలన్న తెలంగాణ ప్రభుత్వానికి ఈ విషయంలో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఈ విషయంపై ఎన్ని విమర్శలొచ్చినా, బాధితులు తీవ్రంగా వ్యతిరేకించినా కాంగ్రెస్ వాటిని పెడచెవిన పెట్టింది. అలాంటిది ఈ విషయంలో గాంధీ మునిమనవడు చేసిన వ్యాఖ్యలతో హస్తం పార్టీకి భారీ షాక్ తగిలింది. మూసీ నది ఒడ్డున గాంధీ విగ్రహం ఏర్పాటు చేయాలన్న తెలంగాణ ప్రభుత్వ ఆలోచనను గాంధీ మునిమనవడు తుషార్ గాంధీ తీవ్రంగా వ్యతిరేకించడమే ఇందుకు కారణం.అందులోనూ వందల కుటుంబాలు ఉంటున్న అపార్ట్‌మెంట్ ఖాళీ చేయించాలన్న ఆలోచనపై తుషార్ గాంధీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రేవంత్ సర్కార్ తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. మూసీ ఒడ్డున భారీ గాంధీ విగ్రహం ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రభుత్వం భావించింది. ఇందులో భాగంగానే అక్కడ ఉన్న మధుపార్క్ రిడ్జ్ అపార్ట్‌మెంట్‌ను ఖాళీ చేయాలని అందులో ఉంటున్న కుటుంబాలకు నోటీసులు ఇచ్చింది.ఇది కాస్తా తీవ్ర వివాదంగా మారింది. రాజకీయ పార్టీల మధ్య విమర్శల తూటాలు కూడా పేల్తున్నాయి. ఈ నేపథ్యంలోనే అసలు తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న ఆలోచనపై గాంధీ మునిమనవడు తుషార్ గాంధీ స్పందించారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకించారు. దీనిని వెంటనే ఆపేయాలని కోరారు. గాంధీ కూడా దీనిని కోరుకోరని, ఇది గాంధీయన్ చర్య ముమ్మాటికీ కాదని వ్యాఖ్యానించారు.ఈమేరకు ఆయన ఎక్స్(ట్విట్టర్) వేదికగా ఒక పోస్ట్ పెట్టారు. విగ్రహ ఏర్పాటు కోసం పేదల ఇళ్లను కూల్చివేయడం, వారిని నిరాశ్రయులను చేయడం మహాత్మా గాంధీ సిద్ధాంతాలకు పూర్తిగా వ్యతిరేకమని అన్నారు. "గాంధీ ఈరోజు బ్రతికి ఉన్నా.. నా పేరుతో ఇలాంటి పనులు వద్దని ఖచ్చితంగా చెప్పేవారు" అని ఆయన పేర్కొన్నారు. ప్రజల కన్నీళ్లపై స్మారక చిహ్నాలు నిర్మించడం తగదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన కోరారు. అభివృద్ధి పేరుతో సామాన్యులను ఇబ్బందులు పెట్టవద్దని, గాంధీ ఆశయాలకు విలువిస్తూ ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మూసీ నది సుందరీకరణలో భాగంగా ప్రపంచంలోనే ఎత్తైన గాంధీ విగ్రహాన్ని ప్రతిష్టించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. అయితే, దీనిపై తుషార్ గాంధీ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ , సామాజిక వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

## తల్లా..రాక్షసినా..?

ప్రతిఘటన, మేడ్చల్

ప్రేమకు ప్రతిరూపంగా చెప్పుకునే అమ్మే.. బిడ్డ పాలిట యమపాశం అయింది. ఏడుస్తుంటే లాలించాల్సింది పోయి.. కట్టేసి కట్టెల పోయిలో పడేసింది. ఈ ఘటన కుత్బుల్లాపూర్ పరిధిలోని దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. రెండు నెలల బాలుడిని కన్నతల్లే కట్టెలపోయిలే వేసి సజీవదహనం చేసింది. ఈ హృదయవిదారక ఘటన స్థానికులను కలచివేసింది. అసలు తల్లి ఎందుకు అలా చేసింది? అన్న వివరాలు ఇంకా తెలీలేదు. స్థానికుల సమాచారం మేరకు ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసుల వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్‌కు చెందిన రాజేంద్ర ఆదివాసీ (21), తన భార్య మమత అహిర్వార్ (20)తో కలిసి బౌరంపేట్‌లోని సనారెల్లి అపార్ట్మెంట్స్ నిర్మాణ ప్రదేశంలో కార్మికులుగా పని చేస్తున్నారు. వీరిద్దరూ అక్కడే ఏర్పాటు చేసిన క్యాంప్ గదిలో నివసిస్తున్నారు. వీరికి రెండు నెలల బాబు ఉన్నాడు. మంగళవారం ఉదయం రాజేంద్ర పని నిమిత్తం బయటకు వెళ్లగా, మధ్యాహ్నం తిరిగి వచ్చి చూసే సరికి తన భార్య బాబును కట్టెల పొయ్యిలో కాల్చుతున్నట్లు గుర్తించాడు. వెంటనే అడ్డుకునే ప్రయత్నం చేసినా అప్పటికే బాబు మృతి చెందినట్లు తెలిపాడు. ప్రతిరోజూ ఏడవడం వల్ల ఇబ్బంది పడుతున్న మమత, ఆ బాబునను చంపాలని నిర్ణయించుకున్నట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. బాబు ఏడవకుండా ఉండేందుకు నోటిలో గుడ్డలు కుక్కి, కాళ్లు కట్టేసి అనంతరం కట్టెల పొయ్యిలో వేసి కాల్చినట్లు సమాచారం. ఈ ఘటనలో శిశువు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న వెంటనే దుండిగల్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని చిన్నారి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. తండ్రి రాజేంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితురాలు మమత అహిర్వార్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.

**భార్యభర్తల మధ్య సఖ్యత లేదా..?**

దంపతుల మధ్య జరిగిన ఘర్షణ స్థానికుల దృష్టికి వెళ్లింది. పరిస్థితులు అనుమానాస్పదంగా కనిపించడంతో వారు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే దుండిగల్ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. శిశువు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ప్రాథమిక విచారణలో హత్య కోణం స్పష్టమవుతున్నట్లు సమాచారం.తల్లి మానసిక స్థితి, కుటుంబ పరిస్థితులు, దంపతుల మధ్య ఉన్న వివాదాలపై పోలీసులు అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నారు. ఖచ్చితమైన మరణ కారణాలు తెలుసుకునేందుకు పోస్ట్‌మార్టం నివేదిక కోసం ఎదురుచూస్తున్నారు. ఈ ఘటనతో బౌరంపేట ప్రాంతంలో విషాద వాతావరణం నెలకొంది. పసిబాలుడిపై జరిగిన ఈ అమానుష ఘటన స్థానికులను కలచివేసింది. దర్యాప్తు పూర్తయ్యాక మరిన్ని వివరాలు బయటకు వచ్చే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు.

## ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ రెడ్డికి సన్మానం

ప్రతిఘటన, మహేశ్వరం రిపోర్టర్ ముత్తయ్య



పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన లక్ష్మీనారాయణ రెడ్డిని జీహెచ్ఎంసీ పరిధిలోని తుక్కుగూడ డివిజన్ బీజేపీ నాయకులు బరిగెల రాజు గౌడ్, జాపాల సుధాకర్, భోద యాదగిరి రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి మాట్లాడుతూ .. పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. తమ పరిధిలో ఎల్లవేళలా పోలీసు శాఖకు తమ సంపూర్ణ సహకారం ఉంటుందని నాయకులు వెల్లడించారు.

# మావోయిస్టు మాజీ చీఫ్ గణపతి ఎక్కడ?

ప్రతిఘటన, హైదరాబాద్

ఆపరేషన్ కగార్ దెబ్బకు దేశంలో మావోయిస్టుపార్టీ ప్రాభవం క్షీణదశకు చేరుకున్నదనే చెప్పాలి. మంగళవారం మధ్యాహ్నం మావోయిస్టుపార్టీలోని కీలక నేతలు ముగ్గురు తెలంగాణ డీజీపీ ఎం శివధరరెడ్డి ముందు లొంగిపోయారు. మావోయిస్టుపార్టీలో అత్యున్నత స్థానమైన కేంద్ర కమిటి ప్రధాన కార్యదర్శి దేవ్ జీ అలియాస్ తిప్పిరి తిరుపతి, కేంద్రకమిటి సభ్యులు మల్లారాజిరెడ్డి, బడే చొక్కారావు అలియాస్ దామోదర్, నున్నే నరసింహారెడ్డి డీజీపీ ముందు సరెండర్ అయ్యారు. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే లొంగిపోతున్న వారంతా తమ ఆయుధాలతో సహా లొంగిపోతున్నారు. ఇక్కడే పార్టీకి రెండు విధాలుగా దెబ్బలు పడుతున్నాయి. ఒకటి మావోయిస్టులు లొంగిపోవటమే దెబ్బ అనుకుంటే, ఆయుధాలతో సహా లొంగిపోవటం ఇంకా పెద్ద దెబ్బ.

**ఆపరేషన్ కగార్‌తో అతలాకుతలం**

మార్చి 31వ తేదీ తర్వాత దేశంలో మావోయిస్టు అన్న పదమే వినిపించకూడదన్నది నరేంద్రమోదీ, అమిత్ షా పట్టుదల. ఇందులో భాగంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సాయంతో సుమారు 2లక్షల మందితో ఆపరేషన్ కగార్ ను కేంద్రహోంశాఖ ప్రారంభించింది. సీఆర్‌పీఎఫ్, కోబ్రా, బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్, గ్రేహౌండ్స లోని మెరికల్లాంటి పోలీసులు, తెలంగాణ, ఛత్తీస్ ఘడ్, ఝార్ఖండ్, మహారాష్ట్ర, ఒడిస్సా పోలీసులతో కలిపి కేంద్రహోంశాఖ ఆపరేషన్ కగార్ ను ప్రారంభించింది. ఆపరేషన్ కగార్ ప్రారంభమైనప్పటినుండి ఇప్పటివరకు సుమారు 450 మంది లొంగిపోతే అంతేసంఖ్యలో ఎన్ కౌంటర్లలో చనిపోయారు. దశాబ్దాలుగా మావోయిస్టులకు అత్యంత సురక్షిత ప్రాంతాలుగా, షెల్టర్ జోన్లుగా భావించే దండకారణ్యంలోకి కూడా భద్రతాదళాలు అత్యంత ఆధునిక ఆయుధాలు, డ్రోన్లు, హెలికాప్టర్లతో చొచ్చుకునిపోతున్నాయి. మావోయిస్టుల షెల్టర్ జోన్లను బద్దలు కొట్టాయి. దాంతో దాదాపు ఏడాదిగా మావోయిస్టుపార్టీలోని కీలకనేతలు బాగా ఇబ్బందిపడుతున్నారు. దానికితోడు భద్రతదాళాలు దండకారణ్యం అడవులను రాత్రనక, పగలనక జల్లెడపట్టి మావోయిస్టులను ఏరేస్తుండటంతో నేతలకు దిక్కుతోచటంలేదు. అందుకనే ఒకవైపు లొంగుబాట్లు మరోవైపు ఎన్ కౌంటర్లు పెరిగిపోతున్నాయి. ఇందులోభాగంగానే మావోయిస్టుపార్టీలోని టాప్ ర్యాకింగ్ నేతలు లొంగిపోయారు.

**గణపతి ఎక్కడ**

సరిగ్గా ఈ సమయంలోనే చాలామంది దృష్టి మావోయిస్టుపార్టీ మాజీ చీఫ్ గణపతి మీదకు మళ్ళింది. ఎన్ కౌంటర్లలో చనిపోయి, లొంగిపోయిన మావోయిస్టులు కాకుండా మరికొందరు సీనియర్ నేతలు సుమారు 300 మంది దాకా అజ్ఞాతంలో ఉన్నట్లు పోలీసులు అంచనా వేస్తున్నారు. పోలీసుల ముందు లొంగిపోవటానికి ఇష్టపడని అతికొద్దిమంది కీలకనేతల్లో మాజీ చీఫ్ గణపతి కూడా ఉన్నారు. ప్రస్తుతం వీరికి పోలీసులకు ఎదురుపడి పోరాడే శక్తి లేకపోవటంతో పాటు అనేకమంది తీవ్రమైన అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నారని పోలీసులకు పక్కా సమాచారం ఉంది. అందుకనే పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు మిసిర్ బెస్రా, కేంద్రకమిటి సభ్యుడు పసునూరి నరహరి, మిలిటరీ ఆపరేషన్లలో దిట్టగా పేరున్న పాపారావు, దామోదర్ తో పాటు మరికొందరు దేశంలోని అనేక ప్రాంతాల్లో తలదాచుకుంటున్నారని సమాచారం. గణపతి నేపాల్ లో షెల్టర్ తీసుకుంటున్నట్లు పోలీసుల దగ్గర సమాచారముంది. ప్రస్తుతం అజ్ఞాతంలో ఉన్న కొద్దిమంది కీలకనేతలతో పాటు గణపతి కూడా లొంగిపోతే మావోయిస్టుపార్టీ చరిత్రలో మిగిలిపోవటం ఖాయం.

**ఎస్ఐబీ కీలకపాత్ర**

మావోయిస్టుపార్టీపై పోలీసులది పై చేయి అవటంలో ఎస్ఐబీ కీలకపాత్ర పోషించిందనే చెప్పాలి. మావోయిస్టుల ఆపరేషన్ల కోసం ప్రత్యేకంగా ఏర్పడిన స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో సమాచార సేకరణ, విశ్లేషణలో అత్యాధునిక పద్దతులను ఉపయోగించింది. ఇప్పటివరకు 14,078 మంది దళసభ్యులను పోలీసులు అరెస్టుచేశారు. 5865మంది కీలకనేతలు, దళసభ్యులు పోలీసుల ముందు లొంగిపోయారు. కేంద్రకమిటి ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు, పీజీఎల్ఏ కార్యదర్శి మాడ్వీ హిడ్మా లాంటి కీలకనేతలతో పాటు 1289 మందిఎన్ కౌంటర్లలో చనిపోయారు. మొత్తంమీద 1057 ఎన్ కౌంటర్లు జరిగాయి. ఎస్ఐబీ ప్రధానంగా మావోయిస్టుపార్టీలోని కీలకనేతలు, అత్యున్నతస్ధాయి నేతలు సుమారు 23మందికి సంబంధించిన సమాచార సేకరణలో సక్సెస్ అయ్యింది. ఏదో పద్దతిలో కీలకనేతలతో టచ్ లోకి వెళ్ళి కొందరిని లొంగుబాట్లకు ఒప్పించిడంలో విజయం సాధించింది. వీరిలో 7 మంది కేంద్రకమిటి సభ్యులు అరెస్టవ్వగా, ఏడుగురు లొంగిపోయారు. మరో 9మంది ఎన్ కౌంటర్లలో చనిపోయారు. 21,232 మంది మావోయిస్టులపై చర్యల్లో ఎస్ఐబీ కీలకపాత్ర పోషించినట్లే చెప్పాలి. మంగళవారం లొంగిపోతున్న నలుగురు కీలక నేతల విషయంలో కూడా ఎస్ఐబీనే కీలకపాత్ర పోషించిందని చెప్పాలి.

# దేశవ్యాప్తంగా ఉచితంగా 'హెచ్‌పీవీ' వ్యాక్సిన్

ప్రతిఘటన, హైదరాబాద్

మహిళలను పీడిస్తున్న గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను శాశ్వతంగా తరిమికొట్టేందుకు కేంద్ర ప్రభుత్వం భారీ కార్యాచరణకు సిద్ధమైంది. ప్రత్యేక టీకా కార్యక్రమంలో భాగంగా 14 ఏళ్ల వయసు పైబడిన బాలికలకు దేశవ్యాప్తంగా ఉచితంగా హెచ్‌పీవీ వ్యాక్సిన్ అందించాలని నిర్ణయించింది. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో 'గార్డాసిల్' ఇంజెక్షన్‌ను పంపిణీ చేయడం ద్వారా బాలికలకు చిన్న వయసులోనే ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ కల్పించాలని కేంద్ర ఆరోగ్య శాఖ భావిస్తోంది.

**ఒక్క డోస్‌తోనే అద్భుత ఫలితాలు**

ఈ వ్యాక్సిన్ గర్భాశయ క్యాన్సర్‌కు ప్రధాన కారణమయ్యే హెచ్‌పీవీ టైప్ 16, 18 తో పాటు టైప్ 6, 11 రకాల వైరస్‌ల నుంచి రక్షణ కల్పిస్తుంది. ఒక డోసు వ్యాక్సిన్ తీసుకోవడం వల్ల బాలికలకు సంబంధిత వైరస్‌ల నుంచి దీర్ఘకాలిక రక్షణ లభిస్తుందని జాతీయ, అంతర్జాతీయ పరిశోధనలు స్పష్టం చేశాయి. జాతీయ వ్యాక్సినేషన్ కార్యక్రమంలో భాగంగా ఈ టీకాను పూర్తిగా స్వచ్ఛందంగా, పైసా ఖర్చు లేకుండా ప్రభుత్వం అందజేయనుంది.

**ధర భారానికి స్వస్తి**

ప్రస్తుతం మార్కెట్‌లో గార్డాసిల్-4 టీకా ఒక్కో డోసు ధర సుమారు రూ.3,927 గా ఉంది. 15ఏళ్ల లోపు వారు రెండు డోసులు, 15 ఏళ్లు పైబడిన వారు మూడు డోసులు తీసుకోవాల్సి ఉంటుంది. ఇంత ఖరీదైన టీకాను సామాన్య ప్రజలు కొనుగోలు చేయడం కష్టతరమన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఉచిత పంపిణీకి శ్రీకారం చుట్టింది. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే 160 దేశాల్లో ఈ టీకా అందుబాటులో ఉండగా, వీటిలో 90 దేశాలు సింగిల్ డోసు విధానాన్ని అనుసరిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్ బాధితుల సంఖ్యలో భారత్ మూడో స్థానంలో ఉండటం ఆందోళన కలిగిస్తోంది. చైనా, అమెరికా తర్వాత ఏటా 15 లక్షల మంది భారతీయులు క్యాన్సర్ బారిన పడుతున్నారని ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. 2040 నాటికి దేశంలో క్యాన్సర్ రోగుల సంఖ్య ఏటా 20 లక్షలకు చేరుకునే ప్రమాదం ఉందని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో ముందస్తు టీకా పంపిణీ ద్వారా గర్భాశయ క్యాన్సర్ మరణాలను గణనీయంగా తగ్గించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది.

# పెళ్లని ఒకడు.. ప్రేమని మరొకడు

**ఒంటరి మహిళలే టార్గెట్‌గా వలపుల వల**

**షాదీ డాట్ కామ్ పేరుతో నయవంచకుడు**

**చర్చకి వచ్చే మహిళలపై కన్నేస్తున్న పాస్టర్**

**హైదరాబాద్‌లో బయటపడ్డ కీచకుల మోసాలు**



**ప్రతిఘటన, హైదరాబాద్ :** పెళ్లి పేరుతో యువతులకు వల వేస్తున్నారు కేటుగాళ్లు. వారిని శారీరకంగా ఉపయోగించుకుని.. పైగా డబ్బు తీసుకుని మోసం చేస్తున్నారు. తాజాగా ఇలాంటి ఘటనలు రెండు వెలుగులోకి వచ్చాయి. షాదీ డాట్ కామ్‌లో పరిచయం చేసుకుని మహిళలను మోసం చేస్తున్న వ్యక్తిపై ఓ మహిళ పోలీసులను ఆశ్రయించింది. మరోవైపు ప్రేమ పేరుతో వల విసురుతున్న ఓ పాస్టర్ బాగోతం వెలుగులోకి వచ్చింది. పెళ్లి కోసం ఈ మధ్య చాలా మంది మ్యారేజ్ వెబ్‌సైట్లను ఆశ్రయిస్తున్నారు. అందులో షాదీ డాట్ కామ్ కూడా ఒకటి. కానీ కొంత మంది కేటుగాళ్లు.. ఆయా వెబ్‌సైట్స్‌లో తమను తాము పెళ్లి కాని యువకులుగా రిజిస్టర్ చేసుకుంటున్నారు. ఆ తర్వాత మెల్లగా ఫోన్ నంబర్ సేకరించి.. మాయమాటలతో యువతులకు వల విసురుతున్నారు. ఐతే ఒంటరి మహిళలనే వారు టార్గెట్ చేస్తూ అందిన కాడికి దోచేస్తున్నారు.

**రూ.30 లక్షలు తీసుకోని ఫోన్ స్విచ్ఛాఫ్**

అతని పేరు చిన్న రంగా నాయక్. హైదరాబాద్ మల్కాజిగిరిలో ఉంటున్నాడు. షాదీ డాట్ కామ్‌లో ఒంటరి మహిళలను ఇతడు టార్గెట్ చేసుకుంటున్నాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మిస్తాడు. తన మాయ మాటలతో నిజంగానే పెళ్లి చేసుకుంటానని నమ్మేలా చేయడం ఇతని స్పెషాలిటీ. అలాగే బాలాపూర్ మండలం మీర్‌పేట్‌లో ఉండే భవానీ అనే మహిళకు వల విసిరాడు. ఆమె ఫోన్ నంబర్ తీసుకుని.. పెళ్లి చేసుకుంటానని పూర్తిగా నమ్మించాడు. చివరకు తనకు ఖర్చులు ఉన్నాయంటూ క్రమక్రమంగా ఆమె వద్ద నుంచి 30 లక్షల రూపాయల వరకు వసూలు చేశాడు. తన ఖర్చుల కోసం అవసరాలు తీరిపోగానే.. ఇల్లు నిర్మించుకుందామని చెప్పాడు. కానీ డబ్బులు తీసుకుని ఫోన్ స్విచ్ఛాఫ్ చేయడంతో భవానీ షాకైంది. గతంలోనూ ఇలాగే తప్పుడు పేర్లతో షాదీ డాట్ కామ్‌లో చిన్న రంగనాయక్ పలువురు మహిళలను మోసం చేసినట్లు భవానీ గుర్తించింది. అలాంటి వ్యక్తిని అరెస్ట్ చేసిన కఠిన శిక్ష పడేలా చేయాలని కోరుతోంది.

**ప్రేమ పేరుతో పాస్టర్ వలపుల వల**

మరోవైపు హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో ఓ పాస్టర్ బాగోతం వెలుగులోకి వచ్చింది. కట్టుకున్న భార్యకు విడాకులు ఇచ్చేసి.. ప్రేమ పేరుతో మహిళలకు వల విసురుతున్నాడు. అతని పేరు సందీప్ వడేగర్. ఉప్పల్‌లో నివాసం ఉంటూ లివింగ్ వే చర్చి పాస్టర్‌గా పని చేస్తున్నాడు. తన భార్యకు విడాకులు ఇచ్చేశాడు. ప్రేమ, పెళ్లి పేరుతో ఓ మహిళను ట్రాప్ చేశాడు. ఆమెకు శారీరకంగా దగ్గరయ్యాడు. ఆమె ప్రభుత్వోద్యోగం చేస్తుండడంతో వచ్చిన జీతం తీసుకుంటూ ఆమెను నిత్యం వేధిస్తున్నాడు. ఐతే అతని వేధింపులు తట్టుకోలేక పాస్టర్ సందీప్ ఆగడాలపై ఆ మహిళ ఆరా తీసింది. సందీప్‌కు అతని స్నేహితుడి భార్యతో వివాహేతర బంధం ఉన్నట్లు గుర్తించింది. దీనిపై అతన్ని నిలదీయడంతో ఏం చేసుకుంటావో చేసుకో అని బెదిరించాడు. సందీప్ బెదిరించడంతో.. ఆ మహిళ పోలీసులను ఆశ్రయించింది. ఈ క్రమంలో నిందితుడు పాస్టర్ సందీప్ వెనుక సికింద్రాబాద్‌లోని మరో చర్చి ఫాదర్ ఉన్నట్లు వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం పోలీసులు మహిళ స్టేట్‌మెంట్ రికార్డ్ చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# 'కేరళ' ఇకపై 'కేరళం'

-మొదటిపేజీ తరువాయి

ప్రవేశపెట్టనున్నారు. 2024 జూన్‌లోనే కేరళ అసెంబ్లీ ఈ పేరు మార్పు కోరుతూ తీర్మానం చేసిన సంగతి తెలిసిందే.

**రైల్వే, విమానయాన రంగాలకు ఊతం**

దేశవ్యాప్తంగా మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా రూ.9,072 కోట్లతో మూడు రైల్వే మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులకు కేబినెట్ కమిటీ ఆమోదం తెలిపింది. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, బీహార్, జార్ఖండ్ రాష్ట్రాల్లో 307 కిలోమీటర్ల మేర కొత్త లైన్లు నిర్మించనున్నారు. గోండియా-జబల్‌పూర్ లైన్ డబ్లింగ్, పునరఖ్-కియుల్, గంహరియా-చాండిల్ మధ్య 3వ, 4వ లైన్ల నిర్మాణం 2030-31 నాటికి పూర్తి కానుంది. కాశ్మీర్ లోయలో కనెక్టివిటీని పెంచేందుకు శ్రీనగర్ ఎయిర్‌పోర్టును రూ.1,677 కోట్లతో సివిల్ ఎన్‌క్లేవ్‌ను అభివృద్ధి చేయనున్నా రు. గుజరాత్ మెట్రో నార్త్-సౌత్ కారిడార్‌ను గిఫ్ట్ సిటీ నుండి షాపూర్ వరకు 3.33 కి.మీ మేర విస్తరించనున్నారు.

**పవర్‌గ్రిడ్ సామర్థ్యం పెంపు**

మహారత్న సంస్థ అయిన పవర్‌గ్రిడ్ పెట్టుబడి పరిమితిని రూ.5,000 కోట్ల నుండి రూ.7,500 కోట్లకు పెంచుతూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఇది పునరుత్పాదక ఇంధన తరలింపునకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో కీలకపాత్ర పోషించనుంది. 2030 నాటికి 500 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ లక్ష్యాన్ని చేరుకోవడంలో ఇది తోడ్పడనుంది.

**జూట్ మద్దతు ధర పెంపు**

2026-27 మార్కెటింగ్ సీజన్‌కు గాను ముడి జనపనార కనీస మద్దతు ధరను కేంద్రం పెంచింది. ఎఱ-3 గ్రేడ్ జనపనార ధరను క్వింటాల్‌కు రూ.5,925గా నిర్ణయించింది. గత సీజన్‌తో పోలిస్తే ఇది రూ.275 అధికం. ఇది సగటు ఉత్పత్తి వ్యయంపై రైతన్నలకు 61.8 శాతం లాభాన్ని చేకూర్చనుంది.

ప్రతిఘటన
తెలుగు దిన పత్రిక

బుధవారం 25
ఫిబ్రవరి 2026

# వనం వీడి జనంలోకి..

-మొదటిపేజీ తరువాయి

దేవ్‌జీ (62) 1978లో అజ్ఞాతంలోకి వెళ్ళిపోయారు. దాదాపు 44 సంవత్సరాలుగా అజ్ఞాత జీవితంలో ఉన్నారు. ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి నంబళ్ల కేశవరావు ఎన్‌కౌంటర్ లో 2024 మే 21న మృతి చెందిన తర్వాత తాత్కాలిక ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. పెద్దపల్లి జిల్లా మంథని మండలం శాస్త్రులపల్లి గ్రామానికి చెందిన మల్లా రాజిరెడ్డి (76) అలియాస్ సంగ్రామ్ 1974లో రాడికల్ విద్యార్థి సంఘం ద్వారా పార్టీలోకి వెళ్లిపోయారు. దాదాపు 46 సంవత్సరాలుగా అజ్ఞాతజీవితం గడిపిన ఆయన ప్రస్తుతం పోలిట్‌బ్యూరో సభ్యుడిగా వ్యవహరిస్తున్నారు. ములుగు జిల్లా తాడ్వాయి మండల, కాల్వపల్లి గ్రామానికి చెందిన బడే చొక్కారావు అలియాస్ దామోదర్ (47) పదవ తరగతి చదువుతూనే 1996లో పార్టీలోకి వెళ్ళిపోయారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. గుంటూరు జిల్లా కాకుమాను మండలం వల్లూరు గ్రామానికి చెందిన నూనె నర్సింహారెడ్డి అలియాస్ గంగన్న (62) జననాట్యమండలి ద్వారా 1990లో పార్టీలోకి వెళ్ళిపోయారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఉన్నారు. ఈ నలుగురూ ఒకేసారి తెలంగాణ డీజీపీ ముందు లొంగిపోయారు.

### దేవుజి ప్రస్థానం

జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన దేవుజి 44 ఏళ్లు అజ్ఞాతంలో ఉన్నారు. 1982లో పీపుల్స్ వార్‌లో చేరారు. దండకారణ్యంలో దళ కమాండర్‌గా పని చేశారు. డివిజనల్ కమిటీ, స్పెషల్ జోనల్ కమిటీ స్థాయిలకు ఎదిగారు. 2001లో సెంట్రల్ కమిటీ సభ్యుడయ్యారు. సెంట్రల్ మిలిటరీ కమిషన్ బాధ్యతలు నిర్వహించారు. 2017లో పొలిట్ బ్యూరో సభ్యుడిగా ఎన్నికై కొనసాగుతున్నారు. ఆయన భార్య సృజన 2020లో ఎన్‌కౌంటర్‌లో మరణించారు.

### మల్ల రాజిరెడ్డి ప్రస్థానం

పెద్దపల్లి జిల్లా శాస్త్రులపల్లెకు చెందిన రాజిరెడ్డి 46 సంవత్సరాలు అజ్ఞాతంలో ఉన్నారు. 1970లలో ఉద్యమంలోకి వచ్చారు. గడ్చిరోలి, దండకారణ్య ప్రాంతాల్లో కీలక బాధ్యతలు చేపట్టారు. 1990లో సెంట్రల్ కమిటీ సభ్యుడయ్యారు. 2007లో పొలిట్ బ్యూరోలో చోటు సంపాదించారు. 2007లో అరెస్టై 2009లో విడుదలయ్యారు. అనంతరం మళ్లీ అజ్ఞాతంలోకి వెళ్లారు. ప్రస్తుతం దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ ఇన్చార్జ్‌గా ఉన్నారు.

### దామోదర్ ప్రస్థానం

ములుగు జిల్లా కాల్వపల్లికి చెందిన దామోదర్ 1998లో ఉద్యమంలో చేరారు. దళ సభ్యుడిగా ప్రారంభించి ఏరియా కమిటీ, డివిజనల్ కమిటీ స్థాయిలకు ఎదిగారు. 2015లో రాష్ట్ర కమిటీ సభ్యుడయ్యారు. 2019లో సైనిక వ్యవహారాల ఇన్చార్జ్‌గా నియమితులయ్యారు. 2025 జనవరిలో తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన తొలి భార్య 2012లో ఎన్‌కౌంటర్‌లో మరణించారు. రెండో భార్య ప్రస్తుతం జైలులో ఉన్నారు.

### గంగన్న ప్రస్థానం

గుంటూరు జిల్లా వల్లూరుకు చెందిన గంగన్న విద్యావంతుడు. బీఎస్సీ పూర్తి చేసి ఎల్ఎల్బీ చదివారు. 1987లో ఆర్ఎస్యూలో చేరి, 1990లో దళ ఇన్చార్జ్ అయ్యారు. 1998లో డివిజనల్ కమిటీ సభ్యుడయ్యారు. పలుమార్లు అరెస్టై 2014లో విడుదలయ్యారు. మళ్లీ అజ్ఞాతంలోకి వెళ్లి ఛాడ్గ్రూజ, ఐఖ్గూజలో కీలక బాధ్యతలు నిర్వహించారు. 2025లో తెలంగాణ రాష్ట్ర కమిటీకి బదిలీ అయ్యారు.

### లొంగుబాటు కారణాలు

సిద్ధాంతపరమైన విభేదాలు, అంతర్గత కలహాలు, క్షేత్రస్థాయి అమలు సమస్యలు పెరిగినట్టు వెల్లడైంది. 2025 అక్టోబర్ 21న ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఇచ్చిన పిలుపుకు స్పందనగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు అధికారులు తెలిపారు. శాంతియుత జీవితం గడపాలనే ఉద్దేశంతో ప్రధాన ప్రవాహంలోకి వచ్చారని పేర్కొన్నారు. దేవుజి, సంగ్రామ్‌పై తలా రూ.25 లక్షలు. దామోదర్, గంగన్నపై తలా రూ.20 లక్షలు. మొత్తం రూ.90 లక్షలను డిమాండ్ డ్రాఫ్టుల రూపంలో అందజేశారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ పథకాల కింద పూర్తి సహాయం అందిస్తామని పోలీసులు స్పష్టం చేశారు. 2025--26లో మొత్తం 544 మంది అండర్‌గ్రౌండ్ కేడర్లు లొంగిపోయినట్టు గణాంకాలు తెలియజేశాయి. వీరిలో 4 సెంట్రల్ కమిటీ సభ్యులు, 15 రాష్ట్ర కమిటీ సభ్యులు ఉన్నారు. ప్రస్తుతం తెలంగాణకు చెందిన 11 మంది మాత్రమే అజ్ఞాతంలో ఉన్నారు. సెంట్రల్ కమిటీలో ఒకే ఒక్క క్రియాశీల సభ్యుడు మాత్రమే మిగిలినట్టు వివరించారు. డీజీపీ ప్రత్యేక ఇంటెలిజెన్స్ శాఖ కృషిని అభినందించారు. మిగిలిన అజ్ఞాత కేడర్లు కూడా స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పునరావాస పథకంతో గౌరవప్రద జీవితం నిర్మించుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ పరిణామం రాష్ట్ర భద్రతా పరిస్థితులపై కీలక ప్రభావం చూపనుందని భావిస్తున్నారు.

### ప్రజా సమస్యలపై పోరాడుతాం
### మల్లా రాజిరెడ్డి



సీఎం రేవంత్‌రెడ్డి, పోలీస్ ఉన్నతాధికారుల పిలుపు మేరకు తాము లొంగిపోయామని మల్లా రాజిరెడ్డి అన్నారు. ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తామన్నారు. తమ సిద్ధాంతాలకు అనుగుణంగా అవకాశాల మేరకు ప్రజల సమస్యలపై పోరాడుతామన్నారు.ఎక్కడ ఉన్నా తన జీవితం ప్రజలకే అంకితం అన్నారు. వారి కోసమే నా పోరాటం చట్టానికి లోబడి కొనసాగుతుందని రాజిరెడ్డి చెప్పారు.

### రాజకీయాల్లోకి వచ్చి ప్రజలకు సేవ చేస్తా : దేవ్ జీ



లొంగిపోయిన మావోయిస్టుపార్టీ నేతల్లో కీలకమైన దేవ్ జీ మీడియాతో మాట్లాడుతు అనారోగ్య కారణాలవల్ల తాను లొంగిపోయినట్లు చెప్పారు. దశాబ్దాల రహస్య జీవితానికి స్వస్తిపలికి బహిరంగ జీవితం గడపాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. దశాబ్దాలుగా తానునమ్మిన జీవితం కోసమే పనిచేసినట్లు చెప్పారు. ఇపుడు లొంగిపోయిన తాను భవిష్యత్తులో ప్రజలకోసమే పనిచేస్తానని చెప్పారు. రాజకీయాల్లోకి ప్రవేశించబోతున్నట్లు కూడా చెప్పారు. తొందరలోనే రాజకీయాల్లోకి ప్రవేశించి ప్రజల సమస్యల పరిష్కారానికి పోరాటం చేయాలని అనుకున్నట్లు తెలిపారు. తాను అనుకుంటున్నట్లు భవిష్యత్ రాజకీయ జీవితానికి ఇబ్బందులు కలిగించవద్దని దేవ్ జీ మీడియాను రిక్వెస్టు చేసుకున్నారు. ఇపుడు ఇంతకన్నా వివరాలను చెప్పలేనని, శేష జీవితాన్ని రాజకీయాల్లోనే గడపాలని కోరుకుంటున్నట్లు 62 ఏళ్ళ దేవ్ జీ అలియాస్ తిప్పిరి తిరుపతి చెప్పారు.

### ఇక మిగిలింది 11 మందే..



మావోయిస్టు పార్టీలో తెలంగాణ ప్రాంతానికి చెందినవారిలో ఇక మిగిలింది 11 మందేనని డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. ఇందులో ఇద్దరు కేంద్రకమిటీ సభ్యులు, ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యులు, ఇద్దరు జిల్లా కమిటీ సభ్యులు, నలుగురు ఏరియా కమిటీ సభ్యులు ఉన్నట్లు వివరించారు. ఇద్దరు ఏరియా కమిటీ సభ్యులు మాత్రమే తెలంగాణ ప్రాంతంలో అజ్ఞాతంలో ఉన్నారని, మిగిలినవారంతా ఇతర రాష్ట్రాల్లో పనిచేస్తున్నట్లు తెలిపారు. పార్టీలో మొత్తం కేంద్ర కమిటీలోనే ప్రస్తుతం ముగ్గురు ఉన్నారని, ఇందులో ఇద్దరు తెలంగాణకు చెందినవారన్నారు. తెలంగాణకు చెందిన కేంద్రకమిటీ సభ్యుల్లో ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి, పసునూరి నరహరి అలియాస్ సంతోష్ ఉన్నారు. రాష్ట్రకమిటీ సభ్యుడు ముప్పిడి సాంబయ్య అలియాస్ సుదర్శన్ ఉన్నారు.తెలంగాణ మావోయిస్టులు పార్టీలో 2023 నాటికి రాష్ట్రానికి చెందినవారు మొత్తం 124 మంది ఉంటే ఇప్పుడు కేవలం 11 మందికి తగ్గిపోయి ఆ పార్టీ ప్రభావం కనీస స్థాయికి చేరుకున్నట్లు వివరించారు. రెండేండ్ల వ్యవధిలోనే సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు మేరకు నలుగురు కేంద్ర కమిటీ సభ్యులు, 15 మంది రాష్ట్ర కమిటీ సభ్యులు, 25 మంది డివిజనల్ కమిటీ సభ్యులు, 63 మంది ఏరియా కమిటీ సభ్యులు, 437 మంది పార్టీ సభ్యుల చొప్పున మొత్తం 591 మంది లొంగిపోయారని, వారితో పాటు 142 ఆయుధాలు ప్రభుత్వానికి అప్పగించినట్లు తెలిపారు.

## ఒకే కుటుంబంలో ముగ్గురు ఆత్మహత్య

ప్రతిఘటన, హైదరాబాద్

కోటీశ్వరులు.. ఆస్తులు అంతస్తులు ఉన్నాయి.. ఇక ఎన్నో ఏళ్లుగా హోటల్ బిజినెస్ చేస్తున్నారు. కానీ ఏం కష్టం వచ్చిందో తెలియదు... అర్థాంతరంగా ఓ కుటుంబం తనువు చాలించింది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. తమ మృతికి ఆర్థిక భారం కారణం అంటూ సూసైడ్ నోట్ రాశారు. నిజంగానే వ్యాపారంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయా? లేక పరువు పోతుందేమోనన్న భయంతో ముగ్గురు సూసైడ్‌కు పాల్పడ్డారా? హైదరాబాద్ అంబర్‌పేట్‌లోని బాపూజీ నగర్‌లో జరిగిందీ విషాద ఘటన. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

### అందరిలోనూ విస్మయమే..

హైదరాబాద్ అంబర్ పేట్ లోని బాపూజీ నగర్‌లో తీవ్ర విషాదం నెలకొంది. ల్యాండ్ మార్క్ హోటల్ యజమాని కుటుంబంలో ముగ్గురు ఆత్మహత్య పాల్పడ్డారు. మృతులను రామ్‌రాజ్, మాధవి, శశాంక్‌గా గుర్తించారు. హైదరాబాద్ అంబర్ పేట్‌లో ల్యాండ్‌మార్క్ హోటల్ యజమాని రామ్‌రాజ్ ఫ్యామిలీ సూసైడ్ చేసుకున్న వార్త స్థానికంగా కలకలం సృష్టించింది. రామ్ రాజ్ ఫ్యామిలీ ఎన్నో ఏళ్లుగా అంబర్‌పేట్‌లోనే నివాసం ఉంటున్నారు. సొంతిల్లు.. పెద్ద భవనం.. కోట్లలో ఆస్తులు ఉన్నాయి. కానీ ముగ్గురు సూసైడ్ చేసుకోవడంపై అంతా ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

### మణికట్టు కోసుకున్న చనిపోలేదని ఉరి

రామ్ రాజ్ ముందు భార్య మాధవిని చంపి, అనంతరం తానూ ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మరోవైపు రామ్‌రాజ్ కుమారుడు శశాంక్ తన ఎడమ చేయి కోసుకుని సూసైడ్ చేసుకున్నాడు. కానీ అతను చనిపోకపోవడంతో ఇంట్లోనే ఉరేసుకున్నట్లు తెలుస్తోంది. ఘటనా స్థలం నుంచి పోలీసులు సూసైడ్ నోట్ స్వాధీనం చేసుకున్నారు. ఆర్థిక ఇబ్బందులతో చనిపోతున్నట్టు రామ్‌రాజ్ సూసైడ్ నోట్ రాసినట్లు పోలీసులు తెలిపారు. తన ఆస్తులు మొత్తం తన కూతురికేనంటూ వీలునామా కూడా రాసినట్లు సమాచారం.

### సూసైడ్ నోట్‌లో ఏం రాశారు..?

ప్రస్తుతం రామ్‌రాజ్ కూతురు అమూల్య కొంపల్లిలో ఉంటుంది. సూసైడ్ నోట్ ఆధారంగా విచారణ చేస్తున్నారు పోలీసులు. రామ్‌రాజ్ కూతురు ఏదైనా కోణంలో అనుమానం వ్యక్తం చేస్తే.. ఆ దిశగా కూడా విచారణ చేస్తామని చెప్పారు పోలీసులు. ల్యాండ్‌మార్క్ హోటల్ యజమాని కుటుంబం మృతిపై రామ్‌రాజ్ అన్న జగదీశ్ తీవ్ర మనస్థాపానికి గురయ్యారు. ఆర్థిక ఇబ్బందులు పెద్ద సమస్య కాదని, తమది వెల్ సెటిల్డ్ కుటుంబం అని చెప్పారు. తమకు ఆర్థికంగా ఎలాంటి ఇబ్బందులు లేవంటున్నారు జగదీష్. నా తమ్ముడు ఫ్యామిలీ సూసైడ్ ఎందుకు చేసుకున్నారో.. అసలు ఏం జరిగిందో తెలియడం లేదని కంటతడి పెట్టారు.

### మిత్రుడికి వాట్సప్ మెసేజ్

మరోవైపు తెల్లవారు 3 గంటల 15 నిమిషాలకు రవి అనే మిత్రుడికి రామ్ రాజ్ వాట్సాప్‌లో సూసైడ్ చేసుకున్నామని మెసేజ్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. తన మిత్రుడు రామ్ రాజ్ ఇంటికి వచ్చి చూసేసరికి భార్యభర్తలు ఇద్దరు ఉరేసుకుని కనిపించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు రవి. రామ్ రాజ్.. అంబర్‌పేట్‌లో ల్యాండ్ మార్క్ హోటల్, మల్లేపల్లిలో బిరియాని సెంటర్, మల్లాపూర్‌లో కింగ్స్ హోటల్, చక్రిపురంలో మరొక హోటల్ నిర్వహిస్తున్నారు. ఐతే ఎవరైనా అప్పులు ఇచ్చిన వారు భయపడితే చనిపోయారా? ఎవరైనా భయపెట్టారా? ఇలా అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు పోలీసులు.

## టెన్త్, ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా బస్సు ప్రయాణం

ప్రతిఘటన, హైదరాబాద్

ఇంటర్మీడియట్, పదవ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆర్టీసీ అన్ని చర్యలు చేపట్టాలని ఆర్టీసీ ఉన్నతాధికారులను మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో ఆర్టీసీ బస్సు ఆపరేషన్స్ పై మంగళవారం సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. హాల్ టికెట్ ఉన్న విద్యార్థులను బస్సులో ఫ్రీగా ప్రయాణించేందుకు అనుమతివ్వాలని ఆదేశించారు. బుధవారం నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు, మార్చి 14 నుంచి పదోతరగతి పరీక్షలు ఉండడంతో పరీక్షల జరిగే ఉదయం, మధ్యాహ్నం సమయంలో అదనంగా బస్సు సర్వీసులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి పొన్నం సూచించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పరీక్షా కేంద్రాలకు వెళ్లే విద్యార్థులకు బస్సులు ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బస్సుల స్టాప్ ఉన్నా లేకున్నా హాల్ టికెట్ ఆధారంగా పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులను దింపేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి డిపో మేనేజర్ ద్వారా ఆర్టీసీ కండక్టర్, డ్రైవర్లకు తెలియజేయాలని ఆదేశించారు. ఈ సౌకర్యాన్ని విద్యార్థులు వినియోగించుకుని ఎలాంటి మానసిక ఆందోళన చెందకుండా పరీక్షలు బాగా రాసి మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని మంత్రి సూచించారు. విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. కాగా, ఈ సమావేశంలో స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, ఆర్టీసీ ఈడీలు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్ర బడ్జెట్ అంచనాలకు దూరంగా కేంద్ర గ్రాంట్లు

హైదరాబాద్

కేంద్రం నుంచి వస్తున్న గ్రాంట్లు బడ్జెట్ అంచనాలను ఏమాత్రం అందుకోవడం లేదు. ఏటా రాష్ట్ర బడ్జెట్‌లో గ్రాంట్ల మొత్తాన్ని భారీగా అంచనా వేస్తూ వస్తున్నారు. తీరా చూస్తే నిధులు మాత్రం ఆశించిన దానిలో మూడో వంతు కూడా రావడం లేదు. ఫలితంగా బడ్జెట్ అంచనాలకు దూరంగా ఉంటోంది. కేంద్ర ప్రభుత్వం నుంచి పన్నుల్లో వాటాతో పాటు రాష్ట్రాలకు గ్రాంట్ల రూపంలో నిధులు వస్తుంటాయి. ఈ నిధులు వివిధ రూపాల్లో వస్తుంటాయి. ప్రతి ఐదేళ్లకు ఒకసారి కేంద్ర ఆర్థికసంఘం ఇచ్చే సిఫార్సులకు అనుగుణంగా రాష్ట్రాలకు కేంద్రం గ్రాంట్ల రూపంలో నిధులు ఇస్తుంది. స్థానిక సంస్థలకు ఇచ్చే నిధులతో పాటు ఎస్డీఆర్ఎఫ్ కింద ఈ నిధులు ఉంటాయి. ఎన్నికల నిర్వహణ, తదితర షరతులకు లోబడి ఈ నిధులను కేంద్రం రాష్ట్రాలకు విడుదల చేస్తుంది. కేంద్ర ప్రాయోజిత పథకాల ద్వారా కూడా రాష్ట్రాలకు నిధులు వస్తుంటాయి. ఆయా పథకాల నిబంధనలకు లోబడి రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసే వాటాకు అనుగుణంగా కేంద్రం నిధులు ఇస్తుంది. కొన్ని ప్రత్యేక సందర్భాలు, అవసరాలను పరిగణలోకి తీసుకొని కేంద్ర ప్రభుత్వం తన విచక్షణ మేరకు రాష్ట్రాలకు ప్రత్యేక గ్రాంట్ల రూపంలో నిధులు ఇస్తూ ఉంటుంది. దాంతో పాటు స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థలకు కూడా కేంద్రం నుంచి గ్రాంట్లు వస్తుంటాయి. రాష్ట్ర ప్రభుత్వ నియంత్రణలో ఉండే యూనివర్సిటీలు, పరిశోధనా సంస్థలు, తదితరాలకు ఈ రూపంలో నిధులు ఇస్తారు. వివిధ రకాలుగా వచ్చే గ్రాంట్ల మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి ఏటా బడ్జెట్?లో పొందుపరుస్తారు. ఆర్థిక సంవత్సరంలో కేంద్రం నుంచి గ్రాంట్ల రూపంలో ఏ మేరకు వచ్చే అవకాశం ఉందో అంచనా వేసి, బడ్జెట్ ప్రతిపాదనలను సిద్ధం చేస్తారు. గ్రాంట్ల విషయంలో అంచనాలకు చాలా దూరంగా ఉంటోంది. బడ్జెట్?లో అంచనా వేసే మొత్తంలో మూడో వంతు కూడా కేంద్రం నుంచి రావడం లేదు. 2021-22 బడ్జెట్?లో అంచనా వేసిన గ్రాంట్ల మొత్తం రూ.38,669 కోట్లు కాగా, కేంద్రం నుంచి అందులో 22 శాతం మేర రూ.8,619 కోట్లు రాష్ట్రానికి వచ్చాయి. 2022-23లో గ్రాంట్ల రూపంలో రూ.41,002 కోట్లు వస్తాయని అంచనా వేశారు. కానీ కేంద్రం నుంచి వచ్చిన మొత్తం రూ.13,179 కోట్లు మాత్రమే. అంచనాలో 32 శాతంగా ఉంది. 2023-24 లో అంచనా వేసిన గ్రాంట్ల మొత్తం రూ.41,259 కోట్లు అయితే, కేంద్రం నుంచి అందులో 23 శాతం మేర రూ.9,729 కోట్లు వచ్చాయి. 2024-25 బడ్జెట్?లో గ్రాంట్ల అంచనాను సగానికి తగ్గించారు. రూ.21,636 కోట్ల అంచనా వేస్తే కేంద్రం అందులో 36 శాతం రూ.7,913 కోట్లు రాష్ట్రానికి ఇచ్చింది. బడ్జెట్?లోనే భారీగా తగ్గించినప్పటికీ వచ్చిన మొత్తం కనీసం 40 శాతం కూడా దాటలేదు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26 బడ్జెట్?లో కూడా గ్రాంట్ల అంచనా పరిమితంగానే ఉంది. రూ.22,782 కోట్లు కేంద్రం నుంచి గ్రాంట్ల రూపంలో వస్తాయని అంచనా వేస్తే జనవరి నెలాఖరు వరకు అందులో కేవలం 18 శాతానికి పైగా రూ.4,213 కోట్లు మాత్రమే వచ్చాయి. మిగిలిన రెండు నెలల్లో ఏ మేరకు వస్తాయో చూడాలి. ఇటీవల కేంద్ర బడ్జెట్ సందర్భంగా 16వ ఆర్థిక సంఘం నివేదికను ప్రవేశపెట్టారు. రానున్న ఐదు ఆర్థిక సంవత్సరాలు ఆ నివేదిక ప్రకారమే రాష్ట్రాలకు గ్రాంట్ల

# నేటి నుంచి ఇంటర్ పరీక్షలు షురూ..

-మొదటిపేజీ తరువాయి

రాయబోతున్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి గంట ముందు చేరుకోవాలని సూచించారు. ప్రాక్టికల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించిన అధికారులు ఇదే తరహాలో మాల్ ప్రాక్టిసుకు తావులేకుండా ఇంటర్ పరీక్షలు నిర్వహించేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

### నిఘా నీడలో పరీక్ష కేంద్రాలు

విద్యార్థుల హాల్ టికెట్లో పేరు, ఫోటో, సబ్జెక్ట్ వివరాల్లో తప్పులు దొర్లితే ప్రిన్సిపాల్ను సంప్ర దించి సవరించుకోవాలని విద్యార్థులకు గతంలో ఇంటర్ బోర్డు అధికారులు సూచించారు. పరీక్షా కేంద్రం ఆవరణ, ప్రశ్నపత్రాలు తెరిచే గదిలో సీసీ కెమెరాలతో ఏర్పాట్లు చేశారు. సీసీ కెమె రాల్లో పరీక్షలు జరుగుతున్న తీరును ఇంటర్ బోర్డు అధికారులు వీక్షించనున్నారు.

### కట్టుదిట్టమైన చర్యలు

ప్రశ్నపత్రాల లీకేజీకి ఆస్కారం లేకుండా ఇంటర్ బోర్డు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుంది. విద్యార్థులు ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని ఇంటర్ బోర్డు చెబుతోంది. విద్యార్థులు మాల్ ప్రాక్టీస్ వంటి చర్యలకు పాల్పడితే మూడేళ్లపాటు డిబార్ చేస్తామని హెచ్చరిస్తు న్నారు. పరీక్షా కేంద్రాల సమీపంలో జిరాక్స్ సెం టర్లు మూసివేసేలా చర్యలు తీసుకోవడంతో పాటు 144 సెక్షన్ విధించనున్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు హాజరయ్యేలా ఆర్టీసీ బస్సులను నడపాలని ఆదేశాలు జారీ చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ కిట్లు, ఓఆర్ ఎస్ ప్యాకెట్లు, మెడికల్ పాయింట్ ఏర్పాటు చేసి సిబ్బంది పరీక్షా కేంద్రాల వద్ద అందుబాటులో ఉండేలా వైద్యాధికారులు చర్యలు చేపట్టాలని అధికార యంత్రాంగం ఆదేశించింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నారు. తాగునీరు, టాయిలెట్స్ తదితర మౌలిక సదుపాయాలు సరైన స్థాయిలో ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. సిట్టింగ్ స్క్వాడ్ను నియమించి, ఎలాంటి సమ స్యలు తలెత్తకుండా చూడనున్నారు.

### పరీక్షా కేంద్రాల వద్ద నిబంధనలు:

పరీక్షా కేంద్రానికి వెళ్లేటప్పుడు ముద్రించిన హాల్ టికెట్ కాపీని తీసుకెళ్లడం తప్పనిసరి. ఇది లేనిదే ప్రవేశం ఉండదు. అభ్యర్థులు తమతో పాటు అడ్మిట్ కార్డ్, పెన్, పెన్సిల్, ఇన్‌స్ట్రుమెంట్ బాక్స్‌ను మాత్రమే తీసుకురావాలి.ఎటువంటి అనధికారిక పత్రాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు లేదా గ్యాడ్జెట్లను కేంద్రం లోపలికి అనుమతించరు.

## అరచేతిలో తెగిన కత్తి

# కామినేని ఆస్పత్రిలో 'ఛత్రపతి శివాజీ' పాట వినిపిస్తూ సర్జరీ!

ఛత్రపతి శివాజీ చిత్రపటానికి నెత్తుటి తిలకం దిద్దుదామనుకుని ఓ యువకుడు చేతికి గాటు పెట్టుకోవడంలో పొరపాటున అరి చేతికి లోతు గాయమైంది. వేలి నరాలు అరచేతి వరకు తెగిపోయేలా చేసింది. హైదరాబాద్ నగరానికి చెందిన 26 ఏళ్ల యువకుడు ఓ ఈవెంట్?లో భాగంగా ఓ పాఠశాలలో విద్యార్థులకు కల్చరల్? యాక్టివిటీస్?లో భాగంగా ప్రదర్శన ఇస్తున్నాడు. 'శూర్ వీర్' అనే పాటలో శివాజీ చిత్రపటానికి తిలకం దిద్దే ఉద్వేగ భరిత సన్నివేశంలో కత్తితో చేతికి చిన్న గాటు పెట్టి నెత్తుటి తిలకం దిద్దాలని భావించాడు. కానీ కత్తి చాలా పదునుగా ఉండడంతో కుడిచేతి చిటికెన వేలు క్రింది భాగంలో లోతుగా అంటే సగం అరచేతి వరకు తెగింది. చిటికెన వేలు, పక్కన వేలుకు వెళ్లే నరాలు, రక్తనాళాలు కట్? అయ్యి తీవ్ర రక్తస్రావం అయ్యింది. చేతివేళ్లు క్రమంగా స్పర్శ కోల్పోవడంతో పాటు పని చేయలేదు. యువకుడు వెంటనే కామినేని ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నాడు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎల్బీనగర్?లోని కామినేని ఆస్పత్రికి చెందిన కన్సల్టెంట్ ప్లాస్టిక్ అండ్ రికన్స్ట్రక్టివ్ సర్జన్ డాక్టర్ బి. కృష్ణ చైతన్య వెల్లడించారు.

ఎల్బీనగర్ ప్రాంతానికి చెందిన ఓ యువకుడు గత కొన్నెళ్లుగా వృత్తి రీత్యా ప్రైవేట్ స్కూళ్లలో కరాటే ట్రైనర్?గా పని చేస్తున్నాడు. వృత్తి నిర్వహణలో భాగంగా ఈ నెల 14న సాయంత్రం ఒక పాఠశాలలో ప్రదర్శన ఇస్తూ, శూర్ వీర్ అనే ఉద్వేగ భరిత పాటకు శివాజీ చిత్రపటానికి నెత్తుటి తిలకం దిద్దే సమయంలో దురదృష్టవశాత్తు అతడి అర చేతికి లోతైన గాయం అయింది. తీవ్రమైన బ్లీడింగ్?తో వెంటనే కామినేని ఆస్పత్రి ఎమర్జెన్సీకి వచ్చారు.

### ఆక్సిజన్ శాతం తగ్గిపోయింది

వెంటనే కన్సల్టెంట్ ప్లాస్టిక్ అండ్ రికన్?స్ట్రక్టివ్ సర్జన్ డాక్టర్ కృష్ణ చైతన్య పరిశీలించారు. అతని కుడి చేతి రెండు వేళ్ల కదలికలు పూర్తిగా ఆగిపోయాయి. వేళ్లలోని నరాలు కట్? కావడంతో రెండు వేళ్లలో రక్తం ఆక్సిజన్ శాతం కూడా తగ్గిపోయింది. స్పర్శ సంబంధిత నరాలు కూడా తెగిపోవడంతో రెండు వేళ్లకు ఎలాంటి చలనం లేకుండా పోయింది. వెంటనే అతడిని వైద్యసిబ్బంది ఆపరేషన్ థియేటర్?కు తరలించారు. వేలులోని నరాలు, రక్తనాళాలు, నొప్పి, ఉష్ణోగ్రత వంటి భావనలను మెదడుకు పంపే సున్నితమైన నాళాలు, అలాగే చిన్న వేలుకు రక్తం సరఫరా చేసే దమనులకు సర్జరీ చేసి మరమ్మతు చేశారు.

"ఆపరేటింగ్ మైక్రోస్కోప్ కింద సున్నితమైన రక్తనాళాలు, నరాలను మానవ వెంట్రుక కంటే సన్నని సూచర్?తో కుట్లు వేశాం. ఈ సర్జరీకి సాంకేతికంగా సూపర్ మైక్రో సర్జరీ అంటారు. శస్త్రచికిత్స ప్రారంభించే ముందు, అతడు ఈవెంట్? వేదికపై ఏ పాటకు ప్రదర్శన ఇస్తున్నాడో అడిగి తెలుసుకున్నాం. అతను "శూరవీర్" పాటకు ప్రదర్శన ఇస్తున్నానని, ఆ సంఘటనకు ముందు ఆ పాట తనను భావోద్వేగానికి గురి చేసిందని చెప్పాడు. అందువల్ల, అతని ఆందోళన మొత్తం తగ్గించి, ధైర్యం పెంచేందుకు అదే పాటను ప్లే చేస్తూ సర్జరీని ప్రారంభించాం. శస్త్ర చికిత్స అనంతరం అతను చేతి వేళ్లకు స్పర్శ రావడంతో నొప్పి తెలియడం ప్రారంభమైంది. దీంతో చిన్నవేలులో రక్త ప్రసరణను మళ్లీ పునరుద్ధరించగలిగాం. ఇదంతా ప్రమాదం జరిగిన వెంటనే ఆస్పత్రికి రావడం వల్ల చేతి వేళ్లను కోల్పోకుండా సర్జరీ చేసి పెద్ద ప్రమాదాన్ని నివారించగలిగాం.

ప్రతిఘటన
తెలుగు దిన పత్రిక
బుధవారం 25 ఫిబ్రవరి 2026

## సంపాదకీయం

# గాల్గోటియా వివాదం భారత ప్రతిష్టకు మచ్చ!

న్యూఢిల్లీలో ఫిబ్రవరి 16-20 మధ్య నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు భారత ఏఐ ప్రతిష్టను ప్రపంచానికి చాటే అవకాశంగా నిలిచింది. అయితే స్టాల్‌లో ప్రదర్శించిన రోబోటిక్ డాగ్ వివాదం దేశవ్యాప్తంగా చర్చకు దారి తీసి, ఏఐ పరిశోధనల నైతికతపై ప్రశ్నలను లేవనెత్తింది. 'భద్రమైన, నైతికమైన, మానవకేంద్రిత ఏఐ' అనే నినాదంతో జరిగిన ఈ సమ్మిట్ 4వది ఇంతకుముందు మూడు అంతర్జాతీయ సమ్మిట్‌లు యూకే, సియోల్, ప్యారిస్ దేశాల్లో జరిగాయి. దీనికి జాతీయ అంతర్జాతీయ మీడియాలో పెద్ద ఎత్తున ప్రాచుర్యం దక్కింది. ఇందులో అంతర్జాతీయ ఏఐ సమ్మిట్‌లో ప్రభుత్వాలు, అంత ర్జాతీయ సంస్థలు, టెక్ కంపెనీలు, శాస్త్రవేత్తలు, విశ్వ విద్యాలయాలు, పరిశోధన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సమ్మిట్‌లో భాగంగా గాల్గోటియ యూనివర్సిటీ తమ స్టాల్‌లో ఒక ఏఐ ఆధారిత రోబోటిక్ డాగ్‌ను ప్రదర్శించింది. మొదట ఇది తమ యూనివర్సిటీ పరి శోధన ఫలితంగానే తయారుచేశామని దాని పేరు 'ఓరియన్' అని ఆ యూనివర్సిటీ ప్రతినిధి ప్రకటించింది. కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ కూడా తన ఎక్స్ ఖాతా ద్వారా ఇదే విషయాన్ని పోస్ట్ చేశాడు.. దేశ మీడియాలో దీనికి విశేష ప్రాచుర్యం పొందింది. కానీ కొద్ది గంటల్లోనే ఆ రోబో డాగ్ చైనా కంపెనీ తయారు చేసిన కమర్షియల్ ఉత్పత్తి అని దాని పేరు యూనిట్రీ అని వెలుగులోకి వచ్చింది. 3 లక్షల డాలర్లు చెల్లిస్తే ఎవరైనా ఆన్లైన్ ద్వారా కొనుగోలు చేయవచ్చు అని వెలుగులోకి వచ్చింది. దీని తర్వాత సదరు యూనివర్సిటీ అది కేవలం విద్యార్థుల సందర్శనార్థం మాత్రమే పెట్టిందని తమ సంస్థ తయారు చేయలేదని వివరించింది. తామే తయారు చేశామని తప్పుడు సమాచారం ఇచ్చిందన్న కారణంతో తమ యూనివర్సిటీలోని ఒక మహిళ అధ్యాపకురాలని బాధ్యుల్ని చేసింది. అంతర్జాతీయ వేదికపై భారత్ పరువు తీసిందని పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో గ్లోబల్ సమ్మిట్ స్టాల్‌ను గాల్గోటియా యూనివర్సిటీ అర్ధాం తరంగా ముగించుకుంది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ గ్లోబల్ సమ్మిట్‌లో ఈ యూనివర్సిటీ చైనా నుండి కొనుగోలు చేసిన రోబోటిక్ డాగ్‌ను తమ యూనివర్సిటీ విద్యార్థులు ఏఐను ఉపయోగించి తయారు చేసినట్టుగా యూనివ ర్సిటీలో 350 కోట్లతో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెంట్ ల్యాబ్‌ను స్థాపించినట్టుగా గ్లోబల్ సమ్మిట్ వేదికగా ప్రకటించింది. కరోనా సమయంలో కూడా ధ్వని తరంగాల ద్వారా కరోనా వైరస్‌ను అంతమొందించవచ్చని ఈ యూనివర్సిటీ విద్యార్థి పరిశోధన ద్వారా నిరూపితం అయిందని ప్రకటించి నవ్వుల పాలయ్యింది. 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఈ యూనివర్సిటీ విద్యా ర్థులను బీజేపీ తన ఎన్నికల ప్రచారాన్ని కోసం తీవ్రంగా వాడుకుంది. మరి ముఖ్యంగా ఈ ప్రైవేట్ యూనివర్సిటీ యాజమాని సునీల్ గల్గోటియాకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో, బీజేపీ పార్టీతో చాలా సత్సంబంధాలు ఉన్నాయి.. అందుకే వీరిపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా కేవలం గ్లోబల్ సమ్మిట్‌లో స్టాల్‌ను ఖాళీ చేయాలని మాత్రమే ఆదేశించారు. బీజేపీ కార్పొరేట్ మతోన్మాద విధానాలను వ్యతిరేకిస్తూ ప్రశ్నిస్తున్న దేశ ప్రజలను దేశద్రోహులుగా, టెర్రరిస్టులుగా, ఉగ్రవాదులుగా, పాకిస్తాన్ చైనా ఏజెంట్లుగా ముద్రలు వేస్తున్న బీజేపీ, కేంద్ర ప్రభుత్వం నేడు అంతర్జాతీయ వేదికపై దేశం పరువు తీసిన గాల్గోటియ యూనివర్సిటీపై ఏ విధమైన చర్యలు తీసు కోకపోవడం నేడు వీరి కపట దేశభక్తిని ప్రశ్నిస్తుంది. దేశంలో విద్యా ప్రవేటీకరణ, కార్పొరేటీకరణ, కాషాయీకరణ వేగంగా జరుగుతుంది. దేశంలో ఉన్న ప్రతిష్టాత్మక యూనివర్సిటీలకు నిధులు కేటాయించడం లేదు. టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయడం లేదు. ఆ యూనివర్సిటీలలో చదువుకునే విద్యార్థులకు ఫెలోషిప్ స్కాలర్షిప్స్‌లు ఇవ్వడం లేదు. విద్యార్థుల మెదళ్లను కలుషితం చేసేలా మతోన్మాదాన్ని ప్రేరేపించే సిలబస్‌ను తీసుకొస్తున్నారు. మరోవైపు దేశంలో ప్రైవేట్ యూనివర్సిటీలు విచ్చలవిడిగా పెరిగిపోతున్నాయి. వీటికి తోడు విదేశీ యూనివర్సిటీలు కూడా తీసుకొస్తామ ని పాలకులు పెద్ద ఎత్తున చెబుతున్నారు.. కానీ ప్రభుత్వ యూనివర్సిటీలు పట్టించుకోకపోతే గాల్గోటియ ప్రైవేటు, విదేశీ యూనివర్సిటీలు దేశంలో విచ్చలవిడిగా వస్తే మన దేశ విద్యార్థులకు విద్య దూరమవ్వవడమే కాకుండా అంతర్జాతీయ వేదికల్లో దేశ ప్రతిష్టకు భంగం వాటిల్లుతుందని దానికి ఒక మంచి ఉదాహరణ. గాల్గోటియా పరిణామం కేవలం ఒక యూనివర్సిటీకి సంబంధించిన అంశంగా కాకుండా, భారత ఏఐ పరిశోధనల నైతికత, పారదర్శకతపై ప్రశ్నలను లేవనెత్తింది.

# నిరాదరణ నీడలో అపురూప దేవాలయం

భారతీయ ప్రాచీన సంస్కృతికి, హైందవ సనా తన సాంప్రదాయాలకు పట్టుకొమ్మగా నిలిచి, ప్రధానంగా బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల త్రైమూర్త్య నిలయమై, వరదాయినియై, భక్తి ముక్తి ప్రదాయినియై, పరమ పావనియైన పవిత్ర గోదావరినదీ తీరాన వెలసి, పౌరాణిక, ఐతిహాసిక, చారిత్రిక ప్రాధాన్యత సంతరించుకుని, హిందూ ముస్లిం మత సామరస్యానికి అనాదిగా ప్రతీకగా, దక్షిణ కాశిగా, హరి హర క్షేత్రంగా, నవనారసింహ క్షేత్రాలలో నొకటిగా రాష్ట్రంలో వాసికెక్కి, నిత్య భక్త జన సందడితో, నిరంతర దైవనామ స్మరణలతో విరాజిల్లుతున్న పవిత్ర తీర్థం - ప్రాచీన ధర్మపురి పుణ్య క్షేత్రం. రాష్ట్రంలోనే గాక, వేరెచ్చటనూ లేని విధంగా, ఈక్షేత్రంలో గల దేవాలయాలు, ఒక్కొక్కటి ప్రత్యేక ప్రతిపత్తిని, ప్రత్యేకతను, వైశిష్ట్యాన్ని కలిగియుండడం విశేషం. అలాంటి ఆలయాలలో అత్యంత వైశిష్ట్యాన్ని సంతరించుకుని, పౌరాణిక, చారిత్రక నేపథ్యాన్ని కలిగిన పతివ్రతా శిరోమణి అయిన సత్యవతీ దేవి ఆలయం, ఆ సాధ్వీమణి పాతివ్రత్యానికి నిలువెత్తు సాక్షిభూతంగా నిలిచిన సైకత (ఇసుక) స్థంభం, దేశంలో వేరెక్కడా లేని విధంగా శివ పానవట్టం మీద నారసింహ విగ్రహం కలిగి శివకేశవాద్వైత సాంప్రదాయానికి ప్రతీకయైన ఆరుదైన విగ్రహాలు నిరాదరణ నీడలో మగ్గుతున్నాయి. ఒకనాడు మహోజ్వలంగా వెలుగొంది సనాతన హిందూ స్త్రీల ధర్మాచరణ సాంప్రదాయంలో భాగంగా, నారీ లోకానికి ఆదర్శమూర్తిగా నిత్య పూజలనందుకున్న సత్యవతీ దేవి ఆదరణ కరువై, నిర్లక్ష్యానికి గురవుతున్నది. వేదవ్యాస విరచితంగా భావించబడే బ్రహ్మాండ, స్కాందాది పురాణాంతర్గతమైన ధర్మపురి క్షేత్ర మహాత్మ్యం గ్రంథంలో సత్యవతీదేవి పాతివ్రత్య వృత్తాంతం వర్ణించ బడింది. నైమిశారణ్యంలో, శౌనకాది మహర్షులకు, సూత పౌరాణికుడు వివరించిన ప్రకారం, నారద మహర్షి పృథు చక్రవర్తికి చెప్పిన విధంగా, పూర్వము సింధు దేశమును పాలించిన వీరసేనుడను రాజు ఆజ్ఞ ప్రకారం జయుడను ఆయన పురోహితుడు, యుక్త వయస్కురాలైన రాకుమారికి, సర్వలక్షణ సమన్వితుడైన రాకుమారుని వరునిగా చేయ సంకల్పించి, ఎన్నో దేశాలు తిరిగి చిత్ర పటములు తెచ్చినా, ఆమె మెచ్చకుండిన కారణంగా విసుగు చెంది, మంత్రోపాయము చేత ఒక సర్పమును బంధించి తెచ్చి, పేటిక యందుంచి, కులాచార ప్రకారం, వరుని చూడకయే యుక్త సమయమున వివాహ మాడమని చెప్పి, దేశము వదలి వెడలి పోయెను. వివాహ ముహూర్త సమయంలో పేటిక తెరచి, భయంకర సర్పమును గాంచి, జరిగిన మోసమును గ్రహించి, వచన బద్ధురాలై, రాకుమారి పామునే తన భర్తగా స్వీకరించెను. ఆ సర్పమును కంఠమున ఉత్తరీయము వలె ధరించి, భగవదనుగ్ర హమునకై తీర్థయాత్రల కేగి, పుణ్య క్షేత్రములను తిరుగుతూ, దండకారణ్య మందలి పుణ్యభూమి యగు ధర్మపురికి ఏతెంచి, పవిత్ర గౌతమీ జలా లలో సర్పముతో కూడి స్నానమాచరించెను. తక్షణమే సర్పము దివ్య పురుషునిగా మారెను. ప్రజలందరి సంశయమును తీర్చి, పాతివ్రత్య నిరూపణకై మూడు ముష్టుల ఇసుకను పిడికిలితో పోయగా, ఆ ప్రదేశమందు సైకతము ఇసుక స్థంభముగా మారెను. రాజకుమారి విజయ సత్యవతి యని పాతివ్రత్య మహిమ కారణంగా సార్థక నామధేయురాలు కాగా, ఆ మహాసాధ్వి స్నాన మాచరించిన స్థలము సత్యవతీ కుండము అని నామాంకితయ య్యెను. అనంతర కాలంలో, సత్యవతీ కుండములో స్నాన మాచరించి, ఆమె దర్శనం చేసుకుని, స్థానిక ఇలవేలుపైన శ్రీనృసింహుని మందిరానికి వెళితే, ఒక్కొక్క పాదమున ఒక్కొక్క అశ్వమేధ యజ్ఞ ఫలం లభించునట్లు వరములు పొందెనని స్థల పురాణాలు స్పష్టం చేస్తున్నాయి. ఇక చారిత్రిక అంశానికొస్తే స్థానిక ఓరియంటల్ డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రాచార్యులు, చారిత్రక పరిశోధకులు, బహుభాషావేత్త డాక్టర్ సంగనభట్ల నర్సయ్య చారిత్రిక పరిశోధనల ఫలితంగా ఇది అపురూపమైన హరిహరనాథ ఆలయంగా భావించ బడుతున్నది. శివ, కేశవులకు అభేదాన్ని పాటించే హరి హర క్షేత్రంలోని ఈఆలయంలో భారతదేశంలో వేరెచ్చటనూ కానరాని విధంగా పానవట్టం మీద నారసింహుని విగ్రహం ఉండడం విశేషం. 11వ శతాబ్దికి చెందిన ఈ ఆలయం మొదట శివాలయమని, తరువాత నారసింహాలయమని, ప్రస్తుతం సత్యవతి అలయమని డాక్టర్ నర్సయ్య పరిశోధన ద్వారా తేల్చి చెప్పారు. ఇక్కడి స్తంభం చాళుక్యుల కాలంనాటి విజయ స్థంభమని పేర్కొన్నారు. ఆరు అడుగుల ఎత్తుగా వితర్దిక కట్టి, దానిపై ఆలయం నిర్మితమైంది. ఆలయ గర్భంనుండి కప్పును చీల్చుకుని అత్యంత ఎత్తుగా నిలిచిన స్థంభము నానుకునే పానవట్టం, దానిపై లింగం స్థానంలో నరసింహుని విగ్రహం ఉంది. దీని పక్కగా పడగ నీడలో లక్ష్మీనారాయణ విగ్రహం ఉంది. కుడిపక్కన నూనె కారుతున్నంత నునుపుగా అమ్మవారి విగ్రహం ఉంది. ఆళ్వారుల విగ్రహాలూ ఉన్నాయి. ఆలయ ప్రవేశంలో రెండు ఆంజనేయస్వామి విగ్రహాలు ఎదురెదురుగా ఉన్నాయి. ద్వారబంధంపై శేషసాయి విష్ణుమూర్తి విగ్రహముంది. ఇంతటి ప్రాధాన్యతను కలిగిన సత్యవతీ ఆలయం తదంతర్గత ఇసుకస్థంభం, ఆలయం లోని అరుదైన విగ్రహాలు ప్రస్తుతం ఆదరణ లేక శిథి లావస్థకు చేరుకున్నాయి. బ్రహ్మపుష్కరిణికి ఎత్తయిన ప్రదేశంలోగల సత్యవతీ ఆలయాన్ని తాజామాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్ చొరవ ఫలితంగా, రాష్ట్ర దేవాదాయ శాఖ స్వాధీన పరుచుకుని, శ్రీలక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానానికి అనుబంధంగా జేసి ప్రత్యేక నిధులతో, క్షేత్ర ప్రాధాన్యతను ఇనుమడింప జేస్తూ సనాతన ఆలయాలను పునరుద్ధరించే చర్యలు గైకొనే చర్యలకు శ్రీకారం చుట్టారు. 20లక్షల ప్రత్యేక నిధులతో పునర్నిర్మాణ పనులు మంజూరి అయి టెండర్లు పిలిచారు. సరైన టెండర్లు రానందున పనులు ప్రారంభింప బడ లేదు. ప్రస్తుత రాష్ట్ర సంక్షేమ శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రత్యేక చొరవ తీసుకుని...దేవాదాయ శాఖ పక్షాన ప్రత్యేక నిధులతో, ఆలయ జీర్ణోద్ధరణ పనులను వెనువెంటనే చేపట్టే చర్యలు తీసుకోవాలని స్థానికులు ముక్త కంఠంతో విజ్ఞప్తి చేస్తున్నారు.

# సమీకరణలు దిశగా ప్రజాతీర్పు

తెలంగాణ రాజకీయ ప్రస్థానంలో స్థానిక సంస్థల ఎన్నికలు కేవలం పరిపాలనా ప్రక్రియలు మాత్రమే కావు; అవి రాష్ట్ర రాజకీయ దిశను నిర్దేశించే సూచికలు. గ్రామ పంచాయతీలు, మండల పరిషత్తులు, జిల్లా పరిషత్తులు ప్రజాస్వామ్యపు పునాది స్థాయిలుగా వ్యవహరిస్తూ ప్రజా అభిప్రాయాన్ని నేరుగా ప్రతిబింబిస్తాయి. ఈ స్థాయిలో వ్యక్తమయ్యే ప్రజా తీర్పు రాష్ట్ర రాజకీయ సమీకరణాలను ప్రభావితం చేసే శక్తి కలిగి ఉంటుంది. అందువల్ల పరిషత్ ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం తీసుకునే నిర్ణయం రాజకీయ వర్గాల్లో సహజంగానే ఆసక్తిని రేకెత్తిస్తోంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత స్థానిక సంస్థల వ్యవస్థను బలోపేతం చేయడం ప్రతి ప్రభుత్వానికీ ఒక ప్రధాన కార్యసూచిగా నిలిచింది. గ్రామీణాభివృద్ధి, పథకాల వికేంద్రీకరణ, ప్రజాపాలనలో పారదర్శకత? ఇవన్నీ పరిషత్ వ్యవస్థ ద్వారా అమలవుతున్నాయి. మండల పరిషత్, జిల్లా పరిషత్ సంస్థలు అభివృద్ధి పనుల పర్యవేక్షణ, నిధుల వినియోగం, స్థానిక అవసరాల గుర్తింపు వంటి అంశాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాయి. అందుకే ఈ ఎన్నికలు సాధారణ రాజకీయ ప్రక్రియల కంటే ఎక్కువ ప్రాధాన్యం సంతరించుకున్నాయి. రాజ్యాంగంలోని 73వ సవరణ ప్రకారం స్థానిక సంస్థలకు ఐదేళ్ల పదవీకాలం నిర్దేశించ బడింది. గడువు ముగిసేలోపు ఎన్నికలు నిర్వహించడం రాష్ట్ర ఎన్నికల సంఘం రాజ్యాంగబద్ధ బాధ్యత. అయితే ఎన్నికల సమయ నిర్ణయంలో రాజకీయ వాతావరణం, పరిపాలనా సిద్ధత, చట్టపరమైన అంశాలు ప్రభావం చూపుతాయి. ఇప్పటికే పరిషత్ ఎన్నికల విషయంలో తీవ్ర జాప్యం చోటు చేసుకుంది. ప్రస్తుతం పరిషత్ ఎన్నికల సమయంపై ప్రభుత్వం సమగ్రంగా ఆలోచిస్తున్నదన్న సంకేతాలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. ప్రస్తుతం అధికారంలో ఉన్న రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం గ్రామీణాభివృద్ధిని ప్రధాన అజెండాగా ముందుకు తీసుకొచ్చినట్లు ప్రకటిస్తోంది. రైతు సంక్షేమం, మౌలిక వసతుల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలను ప్రజల ముందుంచి ఎన్నికలకు వెళ్లాలన్న వ్యూహం కనిపిస్తోంది. ముఖ్యంగా బీసీ రిజర్వేషన్ల అంశంలో స్పష్టత వచ్చిన తరువాత ఎన్నికలు నిర్వహించడం రాజకీయపరంగా అనుకూల వాతావరణాన్ని సృష్టించ వచ్చని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నట్లు సమాచారం. బీసీ రిజర్వేషన్లు స్థానిక సంస్థల ఎన్నికల్లో కీలక అంశం. సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, ట్రిపుల్ టెస్ట్ విధానం, సామాజిక వర్గాల జనాభా ఆధారిత డేటా వంటి అంశాలు రిజర్వేషన్ నిర్ణయంలో ప్రభావం చూపుతాయి. రిజర్వేషన్లపై స్పష్టత లేకుండా ఎన్నికలకు వెళ్లడం చట్టపరమైన చిక్కులు తెచ్చిపెట్టే అవకాశం ఉంది. అందువల్ల ప్రభుత్వం ముందుగా చట్టబద్ధ ప్రక్రియలను పూర్తి చేసి, అవసరమైన అధ్యయనాలు, కమిషన్ నివేదికలు, గణాంక ఆధారాలను సిద్ధం చేసి ఎన్నికలకు వెళ్లాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల జరిగిన పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు ప్రభుత్వానికి ఒక రాజకీయ సూచికగా మారాయి. పట్టణాల్లో లభించిన మద్దతు గ్రామీణ ప్రాంతాల్లో ఎంతవరకు ప్రతిఫలిస్తుందన్నది ఇప్పుడు ప్రధాన ప్రశ్న. గ్రామీణ ఓటరు భావజాలం, వ్యవసాయ పరిస్థితులు, పంటల ధరలు, ఉపాధి హామీ పథకాల అమలు, సంక్షేమ పథకాల చేరువ? ఇవన్నీ పరిషత్ ఎన్నికలపై ప్రభావం చూపే అంశాలు. ప్రభుత్వం ఈ అంశాలపై సమీక్షలు నిర్వహిస్తూ ఎన్నికల సమయంపై నిర్ణయం తీసుకోవాలని చూస్తోంది. బడ్జెట్ సమావేశాల అనంతరం ఎన్నికలు నిర్వహించడం ద్వారా ప్రభుత్వం తన ఆర్థిక ప్రాధాన్యతలను ప్రజలకు స్పష్టంగా తెలియజేయగలదని భావిస్తోంది. బడ్జెట్‌లో గ్రామీణాభివృద్ధి, మౌలిక వసతులు, సాగునీటి ప్రాజెక్టులు, మహిళా స్వయం సహాయక సంఘాల బలోపేతం, యువత ఉపాధి కార్యక్రమాలకు అధిక కేటాయింపులు చేస్తే అది ఎన్నికల ప్రచారంలో ప్రధాన అస్త్రంగా మారే అవకాశం ఉంది. బడ్జెట్ ప్రకటనల ద్వారా సంక్షేమ హామీలను పునరుద్ఘాటించి ఎన్నికల మైదానంలోకి దిగడం రాజకీయంగా అనుకూలమని విశ్లేషకులు సూచిస్తున్నారు. సామాజిక సమీకరణ పరిషత్ ఎన్నికల్లో కీలక పాత్ర పోషిస్తుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళలకు రిజర్వేషన్లు అమలు చేయడం ద్వారా స్థానిక నాయకత్వంలో విస్తృత ప్రతినిధిత్వం కల్పించ బడుతుంది. అయితే రిజర్వేషన్ శాతం, వార్డు పునర్విభజన, జనాభా గణాంకాల ఖచ్చితత్వం వంటి అంశాలు వివాదాలకు దారితీ యవచ్చు. ప్రభుత్వం ముందస్తుగా చట్టపరమైన అభ్యంతరాలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని యోచిస్తోంది. రిజర్వేషన్ల ప్రకటనతోనే స్థానిక రాజకీయ సమీకరణాలు మారిపోతాయి కాబట్టి అభ్యర్థుల ఎంపికలో అన్ని పార్టీలూ జాగ్రత్తగా వ్యవహరించే అవకాశముంది. పరిషత్ ఎన్నికలు సాధారణంగా పార్టీ గుర్తులపై వాస్తవానికి రాజకీయ పార్టీల మద్దతుతో నిర్వహించ బడుతుండగా... గ్రామస్థాయిలో పార్టీ ప్రభావాన్ని కొలిచే పరీక్షగా ఈ ఎన్నికలు భావించ బడుతున్నాయి. అధికార పార్టీకి ఇది తన పాలనపై ప్రజల అభిప్రాయాన్ని అంచనా వేసే వేదిక. ప్రతిపక్షాలకు ప్రభు త్వంపై ఉన్న అసంతృప్తిని సమీకరించే అవకాశం. ప్రచార వ్యూహాలు, అభ్యర్థుల ఎంపిక, కూటముల అవకాశాలు? ఈ ఎన్నికల్లో కీలక అంశాలుగా మారనున్నాయి. పరిపాలనా పరంగా కూడా ఎన్నికల నిర్వహణ పెద్ద సవాలు. ఓటరు జాబితాల నవీకరణ, పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లు, సిబ్బంది నియామకం, భద్రతా ఏర్పాట్లు వంటి అంశాల్లో సమగ్ర ప్రణాళిక అవసరం. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ పారదర్శక ప్రక్రియను అమలు చేయాలన్న ఆలోచన ప్రభుత్వ వర్గాల్లో ఉంది. యువత, మహిళా ఓటర్ల ప్రాధాన్యతను ప్రభుత్వం ప్రత్యేకంగా పరిగణిస్తోంది. గ్రామీణ యువతకు ఉపాధి, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు కల్పించడం, మహిళా స్వయం సహాయక సంఘాలకు ఆర్థిక సహాయం, గ్రామీణ వ్యాపారాలకు ప్రోత్సాహం?ఇవన్నీ ఎన్నికల సమయంలో ప్రధాన చర్చాంశాలుగా మారవచ్చు. సామాజిక సంక్షేమ పథకాల అమలు ప్రజల్లో ఎంతవరకు సానుకూల భావన కలిగించిందన్నది ఎన్నికల ఫలితాల్లో ప్రతిఫలించే అవకాశం ఉంది. రాజకీయంగా చూస్తే పరిషత్ ఎన్నికలు భవిష్యత్ అసెంబ్లీ ఎన్నికలకు ఒక ముందస్తు సంకేతంగా భావించ బడుతున్నాయి. గ్రామీణ ఓటరు మద్దతు ఏ దిశగా ఉందన్నది స్పష్టమవుతుంది. బీసీ రిజర్వేషన్లపై స్పష్టత, బడ్జెట్ సమా వేశాల అనంతర రాజకీయ వాతావరణం, పరిపాలనా సిద్ధత ఈ మూడు అంశాల సమన్వయం ఆధారంగానే తుది నిర్ణ యం వెలువడే అవకాశముంది. మొత్తానికి పరిషత్ ఎన్నికలు తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక మలుపు కావచ్చని చెప్పవచ్చు. ప్రజాస్వామ్యపు పునాది స్థాయిలో జరిగే ఈ ఎన్ని కలు రాష్ట్ర రాజకీయ దిశను నిర్దేశించే శక్తి కలిగి ఉన్నాయి. ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం, పరిపాలనా సామర్థ్యాన్ని ప్రజల ముందుంచి మద్దతు కోరుతుండగా, ప్రతిపక్షాలు ప్రజా సమస్యలను ఎత్తిచూపుతూ పోటీకి సిద్ధమవుతున్నాయి. బీసీ రిజర్వేషన్లపై స్పష్టత, బడ్జెట్ ప్రకటనల ప్రభావం, గ్రామీణ వాతావరణం ఈ మూడు అంశాల సమ్మేళనమే పరిషత్ ఎన్నికల ఫలితాన్ని నిర్ణయించనున్నది. తెలంగాణ రాజకీయా ల్లో తదుపరి దశకు మార్గదర్శకంగా ఈ ఎన్నికలు నిలిచే అవకాశముంది.

## అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి భరోసా ఏది?

ఏ రాష్ట్రమైన, ఏ దేశమైన అభివృద్ధి చెందాలంటే అత్యున్నత విలువ లతో కూడిన ప్రాంతంగా విలసిల్లాలంటే, ఆ ప్రాంతంలోని ఉన్నత విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలి. ఇది చారిత్రక సత్యం, అయితే మన రాష్ట్రంలోని ఉన్నత విద్యను పరిశీలించినట్లయితే తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఉన్నత విద్య రంగంలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. కొత్త యూనివర్సిటీలు, కొత్త కోర్సులు, న్యాక్ ర్యాంకింగ్స్, డిజిటలైజేషన్, పరిశోధనలపై దృష్టి.. ఇలా ప్రభుత్వాలు తరచూ ఉన్నత విద్య అభివృద్ధి గురించి మాట్లాడుతున్నాయి. ఆ మాటలు ఆచరణలో సాధ్యం కావడానికి విద్యాభివృద్ధిలో నిత్యం వెనుక నుండి పనిచేస్తూ వ్యవస్థను నడిపించే నాన్ టీచింగ్ సిబ్బంది పరిస్థితి మాత్రం అగమ్య గోచరంగా తయారయ్యింది. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో మొత్తం 18 యూనివర్సిటీల్లో, ఉస్మానియా యూనివర్సిటీ, కాకతీయ యూనివర్సిటీ, అంబేద్కర్, శాతవాహన, మహాత్మాగాంధీ యూనివర్సిటీ, పాలమూరు, తెలుగు యూనివర్సిటీ, చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ, ఆచార్య ఎన్.జి. రంగా యూనివర్సిటీ, కాళోజి అగ్రికల్చరల్ యూనివర్సిటీ మొదలగు వాటిల్లో సుమారు 5 నుండి 6వేల మంది పై చిలుకు బోధనేతర సిబ్బంది నాన్‌టీచింగ్(అవుట్‌సోర్సింగ్) ఉద్యోగులు పనిచే స్తున్నారు. వీరిలో చాలా మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, డైలీ వేజ్ విధానంలో పనిచేస్తున్నారు. యూనివర్సిటీ పరిపాలన, పరీక్షల నిర్వహణ, విద్యార్థుల సర్టిఫికెట్లు, లైబ్రరీలు, ల్యాబ్‌లు, అకౌంట్స్, అడ్మినిస్ట్రేషన్ వంటి కీలక విభాగాలన్నింటినీ నడిపిస్తున్నవారు వీరే. అయినా సరే, వీరి జీవన భద్రతపై ప్రభుత్వానికి ఎందుకు శ్రద్ధ లేదు?గత ఏడేళ్లుగా వీరి వేతనాల్లో ఎలాంటి గణనీయమైన సవరణ లేదు. చాలాచోట్ల సకాలంలో జీతాలు కూడా అందడం లేదు. ఒకవైపు ధరలు పెరుగుతుంటే, మరోవైపు స్థిర ఆదాయం లేక కుటుంబ బాధ్యతలు ఎలా నిర్వహించాలన్నది అవుట్ సోర్సింగ్ సిబ్బందికి పెద్ద సమస్యగా మారింది. యూనివర్సిటీల్లో రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పని చేస్తున్నా, వారికి లభించే ప్రయో జనాలు మాత్రం నాన్‌టీచింగ్ సిబ్బందికి దక్కడం లేదు. 'సమాన పనికి సమాన వేతనం' అన్న సూత్రం వీరి విషయంలో ఎందుకు అమలు కావడం లేదు? ప్రభుత్వం తరచూ విద్యా వ్యవస్థలో నాణ్యత పెంచాలంటూ ప్రక టనలు చేస్తోంది. న్యాక్ ర్యాంకులు మెరుగుపడాలంటే అకడమిక్ స్టాఫ్‌తో పాటు పరిపాలనా వ్యవస్థ కూడా బలంగా ఉండాలి. కానీ ఆ వ్యవస్థను నడిపించే సిబ్బందే అసంతృప్తితో ఉంటే, నాణ్యత ఎలా పెరుగుతుంది? ఉద్యోగ భద్రత లేని సిబ్బందితో సమర్థవంతమైన పరిపాలన సాధ్యమా ఉన్నత విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తెస్తున్నామని చెప్పుకునే గొప్పలు ఎండమావులు కాక ఏమవుతావుతాయి? నాన్‌టీచింగ్ సిబ్బంది డిమాండ్లు కొత్తవేమీ కాదు. రెగ్యులరైజేషన్, వేతన సవరణ, సామాజిక భద్రత, ప్రమోషన్లు వంటి అంశాలు ఎన్నో ఎండ్లుగా పెండింగ్‌లోనే ఉన్నాయి. ప్రభుత్వం మారినా, హామీలు ఇచ్చినా, ఫైళ్లు కదలడం లేదు.

ప్రతిఘటన
తెలుగు దిన పత్రిక
బుధవారం 25 ఫిబ్రవరి 2026

## మాజీ సర్పంచ్ బొర్రా జగన్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



ప్రతిఘటన, మహేశ్వరం రిపోర్టర్ ముత్తయ్య

వెంకటాపూర్ మాజీ సర్పంచ్ బొర్రా జగన్ రెడ్డి తండ్రి బొర్రా రామ్ రెడ్డి ఇటీవల మృతి చెందారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా దుఃఖసాగరంలో ఉన్న కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, ఈ కష్ట సమయంలో తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా కల్పించారు. అలాగే, పరమపదించిన రామిరెడ్డి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ శ్రద్ధాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బొర్రా జగన్ రెడ్డి, నాయకులు వంగేటి లక్ష్మి, లక్ష్మారెడ్డి, చిగిరింత పెద్ద నరసింహారెడ్డి, శ్రీనివాస్ యాదవ్, బొర్రా మాధవరెడ్డి, బొర్రా శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల మానసిక ఉల్లాసానికి ఆటలు ఎంతో దోహదపడతాయి

**మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి**



ప్రతిఘటన,, మహేశ్వరం ముత్తయ్య

విద్యార్థులకు మంచి చదువుతో పాటు ఆటలు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడతాయని మాజీ లెక్చరర్, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. తుక్కుగూడ కేఎల్ఆర్ వెంచర్ లో రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల మానసిక ఉల్లాసానికి ఆటలు ఎంతో దోహదపడతాయని అన్నారు. ఆరోగ్యంగా ఉండాలంటే ఏ వయసు వారైనా రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని కేఎల్ఆర్ సూచించారు. రాష్ట్ర స్థాయి అండర్ 14, 17,19 స్థాయి స్కేటింగ్ పోటీల్లో 400మంది చిన్నారులు పాల్గొన్నారు. ప్రతీ విద్యార్థిని అప్యాయంగా పలకరించి.. బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన విద్యార్థులను ఆశీర్వాదించారు ఈ కార్యక్రమంలో స్కేటింగ్ అసోసియేషన్ సభ్యులు సహా విద్యార్థుల తల్లిదండ్రులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## పటేల్ గుట్టపై ఛత్రపతి విగ్రహం పెట్టి తీరుతాం అందెల శ్రీరాములు



ప్రతిఘటన, మహేశ్వరం రిపోర్టర్ ముత్తయ్య

హిందూ ధర్మ పరిరక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన సమరయోధుడు ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని భవిష్యత్తులో ఎట్టి పరిస్థితిలో పటేల్ గుట్టపై పెట్టి తీరుతామని మహేశ్వరం నియోజకవర్గం బీజేపీ ఇన్చార్జి అందెల శ్రీరాములు యాదవ్, శివాజీ శక్తి ఉత్సవ సమితీ సభ్యులు పోరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, రవికాంత్ గౌడ్ స్పష్టం చేశారు. నాదర్ గుల్ బీజేపీ కార్యాలయంలో శివాజీ ఉత్సవ సమితి గౌరవ అధ్యక్షులు నడికుడి యాదగిరి, అధ్యక్షులు పోరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నిమ్మల రవికాంత్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా అందెల శ్రీరాములు పాల్గొన్నారు. హిందూ ధర్మ పరిరక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన సమరయోధుడు శ్రీ ఛత్రపతి వీర శివాజీ 396వ జయంతి విజయోత్సహంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ర్యాలీకి అనుమతులు ఉన్నా.. పోలీసుల అడ్డంకులు సృష్టించినా.. వీర శివాజీ వారసులు జయప్రదం చేశారని ఆనందం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం హిందూవుల కార్యక్రమాలపై ఆంక్షలు విధించినా పటేల్ గుట్టపై శివాజీ విగ్రహం పెడతామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సహా హిందూ బంధువులు, శివాజీ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## నితిన్ నబిన్ కు ఘన స్వాగతం పలికిన బరిగల రాకేష్ గౌడ్

ప్రతిఘటన, మహేశ్వరం రిపోర్టర్ ముత్తయ్య



భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడుగా బాధ్యతలు చేపట్టిన తరువాత మరోసారి తెలంగాణ కు విచ్చేసిన నితిన్ నబిన్ ను శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో గౌరవంగా స్వాగతించిన తుక్కుగూడ మున్సిపాలిటీ (జీహెచ్ఎంసీ తుక్కుగూడ 66 వ డివిజన్) బీజేవైఎం అధ్యక్షుడు బరిగెల రాకేష్ గౌడ్ ఘన స్వాగతం పలికారు.

# కాంగ్రెస్ పార్టీ హామీలను తుంగలో తొక్కింది





**ప్రజలను మోసం చేసింది**
**మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి**

ప్రతిఘటన, మహేశ్వరం రిపోర్టర్ ముత్తయ్య

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే మహేశ్వరం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని మాజీ మంత్రి మహేశ్వరం నియోజకవర్గ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మహేశ్వరం మండలం నాగారం గ్రామంలోని పీ.ఏ.సీ.ఎస్ చైర్మన్ , డీ.సీ.ఎం.ఎస్ డైరెక్టర్ మంచే పాండు యాదవ్ ఫార్మ్ హౌస్ లో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సందర్భంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. వికలాంగులకు 6 వేలు, వృద్ధులకు 4 వేలు, రైతులకు రైతు భరోసా, రైతు కూలీలకు, కౌలు రైతులకు 12వేలు, విద్యార్థులకు స్కూటీలు, అసంపూర్ణ రుణమాఫీ, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీన్నింటినీ తుంగలో తొక్కి ప్రజలను మోసం చేసిందన్నారు. బీఆర్ఎస్ పార్టీ తరుపున హామీల అమలుకై పోరాటం చేయాలన్నారు. అలాగే వీటన్నింటి పై ప్రజలు చర్చించుకునే విధంగా చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారంటీలు 420 హామీలు అమలులో పూర్తిగా విఫలమైందని మండి పడ్డారు. మహేశ్వరం మండల పరిధిలోని జెడ్పీటీసీ తో పాటు 13 ఎంపీటీసీకు గెలుచుకోవాలని, రంగారెడ్డి జిల్లా చైర్ పర్సన్ తో పాటు మహేశ్వరం ఎంపీపీ గా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను కూర్చోబెట్టి గులాబీ జెండా ఎగురవేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రయ్య ముదిరాజ్, హనుమగండ్ల చంద్రయ్య , ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నిధులు మంజూరైన అభివృద్ధి జాప్యం

## డీ.ఈ వెంకన్నపై ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆగ్రహం

ప్రతిఘటన, మహేశ్వరం రిపోర్టర్ ముత్తయ్య



నిధులు మంజూరైన అభివృద్ధి జాప్యంపై జీహెచ్ఎంసీ బడంగ్‌పేట్ సర్కిల్ డీ.ఈ వెంకన్నపై ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మీర్ పేట్, జిల్లెలగూడ డివిజన్లలో ఉన్నమంత్రాల చెరువు, చందనం చెరువు అభివృద్ధి పనులను మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. నిధులు మంజూరైనప్పటికీ చెరువుల సుందరీకరణ పనులు ఎందుకు ముందుకు సాగడం లేదని ప్రశ్నించారు. దానికి గల కారణాలు ఏమిటని డి. ఈ వెంకన్న, అధికారులను నిలదీశారు. ఒక స్పష్టమైన ప్రణాళికతో చేపట్టాలని ఎప్పుడో నిర్ణయించిన అభివృద్ధి పనుల్లోఇంతటి అలసత్వం ఎందుకు చోటు చేసుకుంటోందని, నత్తనడకకు గల కారణాలపై జీహెచ్ఎంసీ బడంగ్‌పేట్ సర్కిల్ డీ.ఈ వెంకన్న వివరణ కోరారు. ఎక్కడ ఎలాంటి మార్పులు,చేర్పులు అవసరమో ఆ విషయాలపై కూడా అధికారుల నుంచి స్పష్టత తీసుకుని,తక్షణమే సంబంధిత పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇలాగే పనులు కొనసాగితే సహించబోమని స్పష్టం చేస్తూ, త్వరితగతిన అభివృద్ధి పనులు పూర్తి చేయాలని, ఇకపై ఎలాంటి పనులు కూడా పెండింగ్‌లో ఉండకూడదని కఠిన ఆదేశాలు ఇచ్చారు. అదేవిధంగా, చెరువుల పరిసరాల్లో నడక కోసం వచ్చిన వాకర్స్‌తో కలిసి నడుస్తూ, వారి సమస్యలను ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు. గుర్రపు డెక్కపై వాకర్ ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. త్వరలో అధికారులతో మాట్లాడి గుర్రపు డెక్కను తీసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కార్యదర్శి సామ మహేందర్ రెడ్డి, మీర్ పేట్ అధ్యక్షుడు అర్కల కామేష్ రెడ్డి, నాయకులు భూపాల్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు అనిల్ కుమార్ యాదవ్, సిద్దాల అంజయ్య, మాదరి రమేష్, దీప్లాల్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగులకు పెన్షనర్‌లకు ప్రత్యేక ఆరోగ్య పథకం

**హర్షం వ్యక్తం చేసిన నాగర్ కర్నూల్ జిల్లా టీఎన్జీవో సంఘం**



ప్రతిఘటన, నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో రిపోర్టర్ విజయ్‌కాంత్

రాష్ట్ర ప్రభుత్వం జరిపిన క్యాబినెట్ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా కేబినెట్ మంత్రివర్గం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల కొరకు అమలు చేయనున్న ఉద్యోగుల ఆరోగ్య పథకం చేపట్టడం అలాగే ఉద్యోగులకు కోటి రూపాయల బీమా సదుపాయం కల్పించడం లాంటి, వైద్య విధాన పరిషత్ ఉద్యోగుల జీతాలను 010 పద్దు ద్వారా చెల్లిస్తూ ప్రత్యేక డైరెక్టరేట్ ను మంజూరు చేయడంలాంటి ఉద్యోగ అనుకూల విధానాలను ప్రవేశ పెట్టినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని నాగర్ కర్నూల్ జిల్లా టీఎన్జీవో అధ్యక్షులు, ఉద్యోగ జేఏసీ చైర్మన్ బావండ్ల వెంకటేష్ ,జిల్లా కార్యదర్శి ఎం.డీ షర్ఫుద్దీన్ తమ హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగస్తులకు ఆరోగ్య పథకాన్ని అమలు చేయడం కోసం తీసుకున్న నిర్ణయం వలన దీర్ఘకాలంగా ఆరోగ్య పరంగా ఎన్నో సమస్యలు ఎదుర్కొంటూ సరైన వైద్యసేవలు అందక, ఆర్థిక భారంగా మారిన ఉద్యోగులకు ప్రభుత్వ నిర్ణయం ఎంతో ఊరటనిస్తుందన్నారు. వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరిస్తూ ఉద్యోగులు రిటైర్డ్ ఉద్యోగుల కొరకు ఆరోగ్య పథకాన్ని చేపట్టడం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగా తమ హర్షం వ్యక్తం చేస్తున్నామని తెలిపారు.ఇంకా రాబోయే రోజుల్లో 51% ఫిట్మెంట్ తో 2023 జూలై ఒకటో తేదీ నుండి అమలు అయ్యేలా పీఆర్సీ , పెండింగ్ డీ.ఏ ల మంజూరు,పెండింగ్ లో ఉన్న అన్నిరకాల పెండింగ్ బిల్లుల బకాయిలు జమ లాంటి సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాగర్ కర్నూల్ జిల్లా టీఎన్జీవో సంఘం పక్షాన ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో నాయకులు వై. బాలరాజ్, పున్నారెడ్డి, రాజ్‌కుమార్, రాములు, రెడ్డి రామ్, మధుసూదన్ రెడ్డి, సురేష్ కుమార్, కళ్యాణ్ కృష్ణారావు, చెన్నకేశవులు, యాదగిరి, కృష్ణయ్య, కొత్ర బాలాజీ, అరుణ, శివరత్నమ్మ, లక్ష్మీ కుమారి, రాజవర్ధన్ రెడ్డి, సంఘ సభ్యులు,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మీద తప్పుడు ప్రచారాలు చేస్తే తాట తీస్తాం

**కాంగ్రెస్ నాయకులారా ఖబర్ధార్**

ప్రతిఘటన, మహేశ్వరం రిపోర్టర్ ముత్తయ్య



ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మీద తప్పుడు ప్రచారాలు చేస్తే తాట తీస్తాం.. కాంగ్రెస్ నాయకులారా ఖబర్దార్ అని సోషల్ మీడియా వారియర్, మాజీ సైనికుడు వాసు బాబు హెచ్చరించారు. ఇటీవల ఎస్ఎన్డీపీ నాలాలపై రెండు గంటల పాటు అధికారుల రివ్యూ మీటింగ్ కార్యక్రమం నిర్వహించిన అనంతరం కాంగ్రెస్ నాయకులు లోపలకు చొచ్చుకొని వచ్చి అనవసర రాద్ధాంతం చేశారు. ఆ విషయంపై ఆయన మాట్లాడుతూ.. తప్పుడు ప్రచారాలు మానుకోండి.. ఎస్ఎన్డీపీ పనులను ఏ ప్రభుత్వం చేసిందో తెలుసుకోండి.. మీకు సిగ్గుండాలి మాట్లాడటానికి, రెండు సంవత్సరాల మూడు నెలల పాలనలో రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిన ఘనత ఈ కాంగ్రెస్ ప్రభుత్వానిదే అన్నారు. ఏదైతే మీరు విష ప్రచారం చేస్తున్నారో.. అధికారులను ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి బెదిరించారని.. మీకు దమ్ము ధైర్యం ఉంటే అదే అధికారుల చేత ఫిర్యాదు చేయించాలన్నారు. నిత్యం 18 గంటలు ప్రజాక్షేత్రంలో ఉండి ప్రజల పక్షాన నిలబడే మహేశ్వరం నియోజకవర్గము అభివృద్ధి ప్రదాత సబితా ఇంద్రారెడ్డిని విమర్శిస్తే మీకు రాజకీయ పుట్టగతులు ఉండవన్నారు. అలివి గాని హామీలు ఇచ్చి అధికారం లోకి వచ్చి ఆరు గ్యారెంటీలు, 420 హామీలు నెరవేర్చడం చేతకాక రోజుకు ఒక అటెన్షన్ డైవర్ట్ పాలిటిక్స్ డ్రామా ఆడుతూ పబ్బం గడుపుతున్న కాంగ్రెస్ పార్టీకి నూకలు చెల్లె రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. ఇచ్చిన హామీలకు పైసల్ లేవు, మూలకున్న ముసల్లోలకు రూ. 4వేలు పింఛన్ కు దిక్కులేదు, మహిళలకు నెలకు రూ. 2500లకు టికాన లేదు. అర్జెంట్ గా మూసి నది ఒడ్డున గాంధీ విగ్రహనికి రూ. 5000వేల కోట్లు అవసరమా అని ప్రశ్నించారు. సబితా ఇంద్రారెడ్డి అధికారులను బెదిరించింది దౌర్జన్యం చేసిందనేది తాము ఆమె రాజకీయ చరిత్రలో ఏనాడు వినలేదు భవిష్యత్తులో వినము కూడా అన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని, కాంగ్రెస్ నాయకుల చౌకబార్ విమర్శలు కు భయపడే వాడు ఎవరు లేరని, మీకు ప్రజల అధికారమిచ్చారు మంచిగా పరిపాలించి పేరు తెచ్చుకోండి తప్ప ఇలాంటి విష ప్రచారాలు మానుకోవాలని హితువు పలికారు.

ప్రతిఘటన
తెలుగు దిన పత్రిక
బుధవారం 25 ఫిబ్రవరి 2026

# ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నిర్వహణకు జిల్లాలో ఏర్పాట్లు పూర్తి





**సిద్దిపేట :** ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నిర్వహణకు జిల్లాలో ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా కలెక్టర్ కె.హైమావతి తెలిపారు. నేటి నుండి ఏప్రిల్ 18వ వరకు నిర్వహించనున్న ఇంటర్మీడియట్ పరీక్షల ఏర్పాట్లపై మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సంబంధిత శాఖలో ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు మరియు జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారులతో సమీక్షించి తగు ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ. జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో మొదటి సంవత్సరం విద్యార్థులు 9946 మంది మరియు రెండో సంవత్సరం విద్యార్థులు 10089 మంది మొత్తం 20035 మంది పరీక్షలకు హాజరుకానుండగా 42 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లాలో ఎలాంటి ఆవంచనీయ సంఘటన జరగకుండా ఇంటర్మీడియట్ పరీక్షలను పగడ్బందీగా నిర్వహిస్తామని తెలియజేశారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల జిల్లా అధికారులతో మాట్లాడుతూ. నేటి నుంచి వచ్చే నెల మార్చి 18వ వరకు ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, పరీక్షలు ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు నిర్వహిస్తారని వివరించారు. పరీక్షా కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని, ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పరీక్షలు సజావుగా కొనసాగేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అన్నారు. ముఖ్యంగా పరీక్షలు సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా, నిరంతరం విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులకు ఆదేశించారు, అలాగే పరీక్ష కేంద్రాల వద్ద ఉచిత వైద్య శిభిరాలను ఏర్పాటు చేసి, తగినన్ని మందులు నిల్వ పెట్టాలని వైద్య అధికారులకు సూచించారు, అవసరమైన పోలీసు బందోబస్తే ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖను, పరీక్షా కేంద్రాల వద్ద 163 బి ఎన్ఎస్ సెక్షన్ ఏర్పాటు చేయాలని, అలాగే పరీక్షలు కేంద్రాల సమీపంలో జిరాక్స్ షాపులను మూసి ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు, వేసవి దృష్టిలో పెట్టుకుని నాణ్యమైన త్రాగునీరు సమకూర్చి, కేంద్రాల పరసర ప్రాంతాల్లో పారిశుద్య కార్యక్రమాలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు, పరీక్ష సమయానికి విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా ఆర్టీసీ బస్సులు నడపాలని, పరీక్ష కేంద్రంలోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు, మొబైల్ ఫోన్లను అనుమతించరాదని ఆదేశించారు.అలాగే విద్యార్దులు నిర్ధేశించిన సమయంలోపు పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు చేరుకోవాలని కలెక్టర్ సూచించారు. అలాగే పరీక్షల సమయంలో విద్యార్దులు మానసికంగా ఒత్తిడికి గురైతే, ఒత్తిడిని తట్టుకొని ప్రశాంతంగా పరీక్షలు వ్రాసేవిధంగా టేలి మానస్ నెం: 14416 కి ఫోన్ చేస్తే నిపునులు కౌన్సిలింగ్ ల ఇస్తారన్నారు విద్యార్దులు సమస్యలను నివృత్తి చేసుకోనుటకు కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నెం: 9949330191 కి ఫోన్ చేయవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణ ఐపిఎస్ ఆయేషా ఫాతిమా, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి రవీందర్ రెడ్డి, డీఈవో శ్రీనివాస్ రెడ్డి, డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ ధనరాజ్, డిపిఓ రవీందర్, ఆర్టీసీ, రవాణా తదితర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు రీఎంబర్స్మెంట్ మీద స్పందించకపోతే విద్యార్థి లోకం తిరగబడుతుంది

### కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన ఈటల




**హైదరాబాద్ :** ఫీజు రీఎంబర్స్మెంట్ రాలేదని విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా రేవంత్ రెడ్డి సర్కార్కు చీమకుట్టినట్టు కూడా లేదని మల్కాజ్గిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ విమ్మర్శించారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో జరిగిన అఖిలపక్ష విద్యార్థి సంఘాలు, మేధావులు, ఎస్సీ ఎస్టీ సంఘాల విస్తృతస్థాయి సమావేశానికి ఆయన హాజరై ప్రసంగించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన ఈటల.రేవంత్ రెడ్డిది బండరాయి లాంటి ప్రభుత్వం.మానవత్వం లేని ప్రభుత్వం. మనిషైతే ప్రాణం విలువ తెలుస్తుంది.భూములు అమ్మి డబ్బులు ఢిల్లీకి పంపిస్తున్నాడు.కేసీఆర్ లెక్కనే ఈ సీఎం చుట్టూ కూడా ల్యాండ్ మాఫియా తయారయ్యింది. పేరుకే ప్రజాస్వామ్యం తప్ప పవర్ అంతా సెంట్రలైజ్ అయిపోయింది. హైడ్రా భూమాఫియాకు కొమ్ము కాస్తుంది.చట్టం చట్టబండలై బాసుల ఆదేశాల మేరకే పనులు జరుగుతున్నాయి. దేనికైనా హద్దు పద్దు ఉంటుందన్నారు.గతంలో మాలాంటి ఇందిరా పార్క్ దగ్గర ధర్నాలో మాట్లాడితే ఆ సమస్యకు పరిష్కారం దొరుకుతుందని ధర్నా చేసేవారు కొంత సంతోషపడేవారు. అసెంబ్లీ సమావేశాలు జరిగేటప్పుడు ఈ సమస్య పరిష్కరించండి అని వినతి పత్రాలు ఇచ్చేవారు. కానీ ఇప్పుడు ధర్నాలలో అఖిలపక్ష నాయకులు మాట్లాడినా, సభలో ప్రతిపక్ష నాయకులు సమస్యలు లేవనెత్తినా ప్రభుత్వానికి చీమకుట్టినట్టుగా లేదు అనడానికి సజీవ సాక్ష్యం ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు. మీరు స్పందించకపోతే తెలంగాణ సమాజం తిరగబడుతుందని హెచ్చరిస్తున్నాను. ఫీజురెంబర్స్ మెంట్ బకాయిలు అనేవి కొద్ది మంది కాలేజీ యాజమాన్యాల సమస్య కాదు లక్షల మంది తల్లిదండ్రుల వేదన. ఫీజు కట్టలేదని కాలేజీలో అవమానం ఎదుర్కొని ఆత్మహత్యలు చేసుకున్న వారి దీన గాథ ఇది. మనిషి అనేటువంటి వాడికి తెలుస్తుంది ప్రాణం విలువ, బాధ అంటే ఏమిటి అని. ఈ ప్రభుత్వం మానవత్వం కోల్పోయి బండరాయి లెక్క మారింది. ఎన్నికల్లో హామీలు ఇస్తున్నప్పుడు నేను ఇన్ని డబ్బులు ఎక్కడి నుంచి తీసుకొస్తారు అని ప్రశ్నించాను.. ఆరోజు ఆయనకే తెలివి ఉందా మాకు లేదా అని దబాయించారు.హైదరాబాదులో తునక భూమి అమ్మితే వేలకోట్ల రూపాయలు వస్తాయి వచ్చిన హామీలను అమలు చేస్తానన్న వ్యక్తి రేవంత్ రెడ్డి. వచ్చి రెండు సంవత్సరాలు దాటింది.తునకలు అమ్ముకుంటున్నారు.. ప్రభుత్వంలో ఉన్నట్టుగానే ఈ ముఖ్యమంత్రి చుట్టూ కూడా ల్యాండ్ బ్రోకర్లు, ల్యాండ్ మాఫియా తయారయ్యారు.ఎల్లమ్మబండలో ఉన్న ప్రభుత్వ భూమి ప్రైవేట్ భూమి అని సుప్రీంకోర్టులో నెగ్గింది అంటేనే వారితో ఈ ప్రభుత్వం ఎంతగా కొల్యూడ్ అయిందో అర్థమవుతుంది. దాని విలువ 7వేల కోట్లు.ఫీజు రీయింబర్స్మెంట్ ఇచ్చేది 9 వేల కోట్లు.. ఎల్లమ్మ బండ భూమి అమ్మితే వచ్చేది 7వేల కోట్లు. నిజంగా ముఖ్యమంత్రి దమ్ముంటే ప్రజల పట్ల ప్రేమ ఉంటే నిజంగా సమస్యలు పరిష్కరించాలని ఉంటే ఎందుకు ఈ భూమిని బ్రోకర్లకు కట్టబెడుతున్నాడో సమాధానం చెప్పాలి. హైడ్రా వస్తే పేదల భూములు ఇల్లు పార్కులు కాపాడుతారు అనుకున్నాం ల్యాండ్ మాఫియా గుండెల్లో రైళ్లు పరిగెడతాయని అనుకున్నాం, కానే హైడ్రా ఈ ల్యాండ్ బ్రోకర్లకు అండగా నిలుస్తుంది. గాజుల రామారంలో దగ్గర సర్వేనెంబర్ ఏడులో 300 ఎకరాల భూమిలో 40 గజాల్లో గుడిసెలు వేసుకుంటే వాటిని కూలగొట్టారు కానీ ల్యాండ్ మాఫియా చేతిలో ఉన్న భూమిని మాత్రం ముట్టలేదు.పేదల ఇల్లు కూలగొట్టి 15 వేల కోట్ల రూపాయల విలువగల భూమిని కాపాడామని ప్రకటన ఇచ్చుకోవడం నిస్సిగ్గుగా ఉంది. 5వేల కోట్ల పెట్టి గాంధీ విగ్రహాలు పెడతాను, లక్షన్నర కోట్లు పెట్టి మూసి ప్రక్షాళన చేస్తానని ముఖ్యమంత్రి చెప్తున్నారు..అభ్యంతరం లేదు కానీ మా పిల్లల ఆత్మహత్యలు ఆపి, మా పిల్లలకు దూరమవుతున్న విద్య అందించిన తర్వాత మీ ఇష్టం వచ్చినట్టు చేసుకోండి. చీఫ్ సెక్రటరీ స్థాయి అధికారి ఫైనాన్స్ సెక్రెటరీలు మా చేతిలో కూడా ఏమీ లేదుని చేతులెత్తేస్తున్నారు. పేరుకే ప్రజాస్వామ్యం తప్ప పవర్ అంతా సెంట్రలైజ్ అయిపోయింది. ముఖ్యమంత్రి కార్యాలయం ఆర్థిక మంత్రి చెప్పితే తప్ప బిల్లులు రాని పరిస్థితి ఉంది. ఈ రాష్ట్రం ఎటువైపు పోతుందో అర్థం చేసుకోవాలి. రిటైర్డ్ ఉద్యోగులకు వారు దాచుకున్న బెనిఫిట్స్ అందడం లేదు. కాంట్రాక్టు పని చేసిన వారు బిల్లులు రాక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. కానీ బిల్లుల కోసం బ్రోకరిజం చేసే వాళ్ళు మాత్రం కోట్లకు పడగలెత్తుతున్నారు. డబ్బులు సంపాదించాలి కేంద్ర పార్టీకి పంపించాలి అనే జెండా తప్ప మరోటి లేదు. పిల్లి కళ్ళు మూసుకొని పాలు తాగినట్లుగా మీరు పనులు చేస్తున్నారు కానీ మీరు చేస్తున్నవన్నీ లెక్క రాసి పెడుతున్నాము. సందర్భం వచ్చినప్పుడు తెలంగాణ సమాజం సత్తా చూపిస్తుంది. దేనికైనా హద్దు పద్దు ఉంటుంది.. తెలంగాణ సమాజానికి మాయ చేయడం రాదు బరిగిసి కొట్లాడుతుంది. పాతబకాయిలు అని తప్పించుకుంటున్నారు పాత బకాయిలు ఉన్న ఇళ్ల బిల్లు, కరెంటు బిల్లు, నల్లాబిల్లును వసూలు చేయడం లేదా ? బకాయిలు ఎట్లా వసూలు చేసుకుంటున్నారో గతంలో ఉన్న బకాయిలను కూడా చెల్లించాలని జ్ఞానం మీ ప్రభుత్వానికి లేదా ? అధికారులారా మీరు బానిసలు లెక్క పనిచేయకండి. వాళ్లకంటే సోయి లేదు, ఐఏఎస్ అధికారులు మీరేనా చెప్పండి. మంచి పోస్టింగుల కోసం వాళ్ల దగ్గర బానిస లెక్క మారటం జుగుప్సాకరంగా ఉంది. తెలంగాణలో సామాన్య ప్రజలకు దిక్కు మొక్కు లేకుండా పోయింది. చట్టం చట్టబండలై బాసుల ఆదేశాల మేరకే పనులు జరుగుతున్నాయి. స్వామిబద్ధంగా న్యాయబద్ధంగా ధర్మపద్ధంగా పాలన జరగడం లేదు. ఇది మంచిది కాదు. తెలంగాణ తెచ్చుకుంది ఇందుకోసం కాదు. తెలంగాణ తెచ్చుకుంది ఆకలి కేకలు లేని ఆత్మహత్యలు లేని సమాజం కోసం. తెలంగాణ ప్రజలారా కొంతమంది సంఘాలు నాయకులు మాట్లాడినంత మాత్రాన ఈ సమస్య పరిష్కారం కాదు. మీరు కన్నెర్ర చేస్తేనే పరిష్కారం అవుతుంది. కర్రు కాల్చి వాత పెట్టే స్థాయికి రాకపోతే వీరు మారరు. ప్రజల కన్నీళ్లు పెడుతున్నప్పుడు రాజకీయ పార్టీలు కూడా బయటకు వచ్చి ప్రజల అవసరాల కోసం కొట్లాడాలని పిలుపు నిచ్చారు.. మీరు చేస్తున్న ఈ ఉద్యమానికి నా సంపూర్ణ మద్దతు ఉంటుందనీ ఈటల రాజేందర్ అన్నారు.

## గాంధీ విగ్రహం వద్దు

**హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టులో భాగంగా బాపూఘాట్ వద్ద ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన మహాత్మాగాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్న నిర్ణయం ఇప్పుడు సరికొత్త చర్చకు దారితీసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం భారీ వ్యయంతో 'గాంధీ సరోవర్' ప్రాజెక్టును నిర్మించి, అక్కడ గాంధేయవాద కేంద్రాన్ని నెలకొల్పాలని ప్రణాళికలు సిద్ధం చేసింది. అయితే, ఈ భారీ విగ్రహ ఏర్పాటుపై స్వయంగా గాంధీజీ మునిమనుమడు తుషార్ గాంధీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. విగ్రహాల ఏర్పాటు కంటే ప్రజల ప్రాథమిక అవసరాలకే ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన ప్రభుత్వానికి హితవు పలికారు.ఈ ప్రాజెక్టుపై తన నిరసనను వ్యక్తం చేస్తూ, విగ్రహాల కోసం కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని ఖర్చు చేయడం ఏమాత్రం సమర్థనీయం కాదని తుషార్ గాంధీ అభిప్రాయపడ్డారు. దేశంలో విగ్రహాల సంస్కృతి పెరిగిపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తూ, ఆ నిధులను విద్యాసంస్థలు, వైద్య సౌకర్యాల మెరుగుదల కోసం కేటాయిస్తే అది నిజమైన గాంధేయవాదం అవుతుందని ఆయన స్పష్టం చేశారు. బాపూ ఆశయాలను విగ్రహాల రూపంలో కాకుండా, సామాన్య ప్రజల సంక్షేమంలో ప్రతిబింబించేలా చూడాలని ముఖ్యమంత్రికి సూచించారు. తాను వ్యక్తిగతంగా విగ్రహాల ప్రతిష్టకు వ్యతిరేకమని చెబుతూ, ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునరాలోచించుకోవాలని కోరారు.మరోవైపు, ఈ ప్రాజెక్టు కోసం లంగర్ హౌస్ పరిసరాల్లో జరుగుతున్న భూసేకరణ ప్రక్రియ స్థానిక ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. తమ నివాసాలను కోల్పోతామనే భయం ఒకవైపు, పర్యావరణ అనుమతులు లేకుండా పనులు మొదలుపెడుతున్నారనే విమర్శలు మరోవైపు వినిపిస్తున్నాయి. అయితే, ప్రభుత్వం మాత్రం ఇది కేవలం పర్యాటక ప్రాజెక్టు మాత్రమే కాదని, మూసీ నదిని ప్రక్షాళన చేసి హైదరాబాద్ రూపురేఖలను మార్చే ప్రక్రియలో ఇదొక కీలక భాగమని సమర్థించుకుంటోంది.

## ఇంటర్, 10వ తరగతి పరీక్షలను పకడిబందిగా నిర్వహించాలి

### సీఎస్ కె.రామ కృష్ణ రావు

నేటి నుంచి మార్చి 18 వరకు ఇంటర్ థియరీ పరీక్షల నిర్వహణపరీక్షా కేంద్రాలకు 5 నిమిషాలు ఆలస్యమైనా అనుమతి.ప్రతి పరీక్షా కేంద్రం వద్ద పారా మెడికల్ సిబ్బంది అందుబాటులో ఉండాలి.పరీక్షా సమయానుకూలంగా ఆర్టీసీ బస్సులు నడపాలి10వ తరగతి, ఇంటర్ పరీక్షల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన సీఎస్.. ఇంటర్ పరీక్షలను రాష్ట్రంలో కట్టుదిట్టంగా నిర్వహించాలని సి.ఎస్.కె. రామకృష్ణారావు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సీఎస్ కె.రామ కృష్ణ రావు ఇంటర్, పదవ తరగతి పరీక్షల నిర్వహణపై అన్ని జిల్లాల కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ కె.రామ కృష్ణ రావు మాట్లాడుతూ. నేటి నుంచి మార్చి 18 వరకు జరిగే ఇంటర్ పరీక్షల నిర్వహణకు కట్టు దిట్టమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు. పరీక్షా కేంద్రాలకు 5 నిమిషాలు ఆలస్యమైనా విద్యార్థులను అనుమతించాలని స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రాలకు ఎవరికీ సెల్ ఫోన్ తీసుకుని రావడానికి అనుమతి లేదని, సీసీ కెమెరాల సమక్షంలోనే ప్రశ్నాపత్రాలు సీల్ ఓపెన్ చేయాలని అన్నారు. పరీక్ష కేంద్రాలకు వచ్చే ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా చెక్ చేయాలని అన్నారు. పరీక్ష కేంద్రాలకు ప్రవేశద్వారం వద్ద ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా చెక్ చేసే వ్యవస్థ ఏర్పాటు చేయాలని అన్నారు. పరీక్షల నిర్వహణకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని,పరీక్ష కేంద్రాల వద్ద నిరంతర విద్యుత్ సరఫరా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు పరీక్ష హాల్స్ లో త్రాగు నీరు అందించాలని, అవసరమైన మౌళిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.పరీక్షల నేపథ్యంలో విద్యార్థుల సౌకర్యార్థం రవాణా కోసం పరీక్షకు సకాలంలో హాజరయ్యే విధంగా అనుకూలంగా ఆర్టీసీ బస్సులు పరీక్షా కేంద్రాల రూట్ లలో స్పెషల్ బస్సులు నడపాలని అన్నారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్లు, కనీస మందులతో పారా మెడికల్ సిబ్బంది అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో పారిశుద్ధ్య నిర్వహణ స్థానిక సంస్థలు పర్యవేక్షించాలని ఆయన సూచించారు.

## బపర్ జోన్ పేరుతో ఇండ్ల తొలగింపును ఆపాలి

### సీపీఐ (ఎమ్ఎల్) సీపీ రెడ్డి పార్టీ

### జాతీయ కార్యదర్శి మల్లేపల్లి ప్రభాకర్ డిమాండ్

**హైదరాబాద్ :** మాసి సుందరీకరణలో భాగంగా బపర్ జోన్ పేరుతో పేదల ఇండ్లను కూల్చాడ నీ తక్షణమే నిలిపి వేయాలని సీపీఐ ( ఎమ్ ఎల్) సీపీ రెడ్డి పార్టీ జాతీయ కార్యదర్శి మల్లేపల్లి ప్రభాకర్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం న్నీ డిమాండ్ చేశారు ఈ మేరకు ఒక ప్రకటనలో పేర్కొన్నారు ' మూసి నది మురికి కూపంగా మారిన నేపద్యంలో ప్రక్షాళన, నిజమైన నిజమైన పునర్జీవం జరగాలని హైదరాబాద్ ప్రజలు కోరుకుంటున్నారు,కానీ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను చూస్తుంటే ప్రక్షాళన కంటే సుందరీకరణ,రియల్ ఎస్టేట్,టూరిజం వ్యాపారికరనే కె ప్రాధాన్యత ఇస్తున్నట్లు స్పట్సం అవుతున్నది అని మూసి నదికి ఇరు వైపుల 50 మీటర్లు వరకు " బపర్ జోన్" పేరుతో దశద్పులుగా నివసిస్తున్న ప్రజల ఇండ్లను తొలగించేందుకు ప్రభుత్వం సిద్ధపడటం అన్యాయమైనది , ప్రభుత్వ అనుమతులతో నిర్మించుకున్న ఇండ్లను ఇపుడు అక్రమంగా ఎలా ప్రకటిస్తారు? బపర్ జోన్ లో ఉంటే గతంలో అనుమతులు ఎలా ఇచ్చారు? ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా ఏక పక్షంగా కూల్చివేతలు చేపట్టడం ప్రజాస్వామ్య విరుద్ధం అని పేర్కొన్నారు, మూసి నది వరదలతో ఏనాడు మునిగి పోనీ బస్తీలు,కాలనీలను ఈ ప్పుడు తొలగించాల్సిన అవసరం ఏమొచ్చింది? గరిష్ట నది ప్రవాహ మట్టం వివరాలను ఎందుకు ప్రజలకు వెల్లడించడం లేదు? అని నిలదీశారు" గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ ' రీ వర్ ప్రోంట్ డెవలప్మెంట్" పేర్లతో పేద ప్రజల ను నిరస్రేయుల్ని చేసి, ఆ భూములను ,టూరిజం,ప్రవేట్ ప్రాజెక్టు లకు కట్ట బెట్టే ప్రయత్నని విరమించుకోవాలని డిమాండ్ చేశారు, గుజరాత్ లోని సబర్మతి నది అభివృధి నమూనతో వేలాది పేదలను అక్కడ నుండి తరిమేసి నారు,అక్కడి పరిస్థితి హైదరాబాద్ ప్రజల కు రాబోతున్నది కావున రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెన్నకి తీసుకోవాలని డిమాండ్ చేశారు ,ఆ ప్రాజెక్ట్ డీ పి ఆర్ , ఎమ్ ఎఫ్ ఎల్ వివరాలను బహిర్గతం చెయ్యాలని కోరారు మూసి నది పరివాహక ప్రజల శాశ్వత పరిష్కారం తీసుకోవాలని డిమాండ్ చేశారు లేని పక్షం లో మూసి బాదితుల పక్షాన ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు

## డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం

### జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్



**నారాయణపేట :** రోడ్డు ప్రమాదాల నివారణే ప్రధాన లక్ష్యంగా చేపట్టిన 'ఏరైవ్ అలైవ్ ' 2వ విడత అవగాహన కార్యక్రమంలో భాగంగా మంగళవారం నాడు జిల్లా ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆటో, టాక్సీ మరియు పోలీస్ వాహన డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ శిబిరాన్ని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నివారణలో డ్రైవర్ల పాత్ర అత్యంత కీలకమని, ముఖ్యంగా డ్రైవర్లకు కలర్ బ్లైండ్, వయస్సు పెరిగే కొద్ది కంటి చూపు మందగించడం జరుగుతుంది అని అలాంటి వారికి చికిత్స ద్వారా కంటి వైద్య పరీక్షలు నిర్వహించుకొని తగిన జాగ ముఖ్యంగా డ్రైవర్లకు సమస్యలు లేకుండా కంటి చూపు సక్రమంగా ఉండటం అత్యవసరమని తెలిపారు. కంటి చూపు స్పష్టంగా ఉంటే ట్రాఫిక్ సిగ్నల్స్, రహదారి సూచనలు సరిగ్గా గుర్తించి సురక్షితంగా వాహనాలు నడపగలరని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఆటో, టాక్సీ డ్రైవర్కు కంటి వైద్య పరీక్షలు నిర్వహించాలనే ఉద్దేశంతో కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాలు అందించడమే కాకుండా, తగిన చికిత్సలు కూడా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా అందించబడతాయని ఎస్పీ వివరించారు. డ్రైవర్లకు రోడ్డు భద్రత నియమాలపై పలు ముఖ్య సూచనలు చేశారు. వాహనాలు నడిపేటప్పుడు వేగ పరిమితులను తప్పనిసరిగా పాటించాలని, ట్రాఫిక్ సిగ్నల్స్ మరియు రహదారి సూచనలను పాటించాలని, మద్యం సేవించి వాహనం నడపకూడదని, కారులో సీట్ బెల్ట్ మరియు ద్విచక్ర వాహనంపై హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని తెలిపారు. డ్రైవింగ్ సమయంలో సెల్ ఫోన్ వినియోగించరాదని, అలసట లేదా నిద్రలేమి ఉన్నప్పుడు వాహనం నడపవద్దని హెచ్చరించారు. వాహనాలకు సంబంధించిన లైసెన్స్, ఇన్సూరెన్స్, ప్యూసీ, రిజిస్ట్రేషన్ వంటి పత్రాలు చెల్లుబాటు అయ్యేలా చూసుకోవాలని, బ్రేకులు, లైట్లు, టైర్లు సరిగా ఉన్నాయో లేదో నిరంతరం పరిశీలించాలని సూచించారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, చిన్న జాగ్రత్త ప్రాణాలను కాపాడగలదని ఎస్పీ పేర్కొన్నారు.

ఈ శిబిరం ద్వారా మొత్తం 70 మంది డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించామని, రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి ప్రమాద రహిత సమాజ నిర్మాణానికి సహకరించాలని కోరారు.

# ఈపీఎఫ్ఓ శుభవార్త.. 31 లక్షల మందికి బెనిఫిట్




ప్రైవేట్ రంగంలో ఉద్యోగుల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన గొప్ప సామాజిక భద్రతా పథకం ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్. దీనిని ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ నిర్వహిస్తోంది. కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఇది పని చేస్తుంది. ఇప్పుడు ఈపీఎఫ్ఓ కు సంబంధించి.. లేబర్ మినిస్ట్రీ ఒక కీలక ప్రకటన చేసింది. ఇది ఒక రకంగా శుభవార్త. ఈపీఎఫ్ఓ ఇన్ఆపరేటివ్ అకౌంట్లకు సంబంధించి అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లను వారి వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయం తీసుకుంది. క్లెయిమ్ చేయని వారి పీఎఫ్ ఖాతాల్లో పెద్ద మొత్తంలో నిధులు పోగుబడగా.. వీటిని చందాదారుల ఖాతాల్లోకే బదిలీ చేయాలని నిర్ణయించడం విశేషం. ఈ కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో సుమారు 31 లక్షల మంది వరకు చందాదారులకు ప్రయోజనం దక్కనుంది. అయితే పైలట్ ప్రాజెక్టుగా చేపట్టే తొలి విడతలో సుమారు 7 లక్షల మంది వరకు ఈ ప్రయోజనాలు పొందుతారని కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ చెప్పుకొచ్చారు. త్వరలోనే ఇది ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈపీఎఫ్ఓ వీక్లీ రివ్యూ మీటింగ్‌లో ఈ నిర్ణయం తీసుకున్నట్లు మాండవీయ సోమవారం వివరించారు. ప్రస్తుతానికి 31.86 లక్షల వరకు పీఎఫ్ ఖాతాలు.. నిర్వహణ లేవని (ఇనాపరేటివ్) ఈపీఎఫ్ఓ గుర్తించింది. దీంట్లో సుమారు రూ. 10,903 కోట్ల మేర నిల్వలు ఉన్నట్లు అంచనా వేస్తోంది. వీటిల్లో సుమారు 7.11 లక్షల ఖాతాల్లో రూ. 1000 వరకు మాత్రమే నగదు నిల్వలు ఉన్నట్లు పేర్కొంది. వీటి విలువ మొత్తంగా రూ. 30.52 కోట్లుగా ఉన్నాయి. లేబర్ మినిస్ట్రీ ప్రకారం.. ఈ నిర్వహణలో లేని పీఎఫ్ ఖాతాల్లో 20 ఏళ్లకు పైబడినవి కూడా ఉన్నాయి. దాదాపు మూడేళ్లుగా ఎలాంటి ట్రాన్సాక్షన్ నిర్వహించిన పీఎఫ్ అకౌంట్లను ఇన్ఆపరేటివ్ అకౌంట్లుగా పేర్కొంటారు. ముందుగా ఇప్పుడు పైలట్ ప్రాతిపదికన ముందుగా 7 లక్షల ఖాతాల్లోని అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లను వారి బ్యాంక్ అకౌంట్లలో జమ చేయనుంది ఈపీఎఫ్ఓ. ఇక్కడ ఆధార్‌తో అనుసంధానం అయి ఉన్న బ్యాంక్ అకౌంట్, ఈపీఎఫ్ఓ దగ్గర ఉన్నటువంటి వివరాల ఆధారంగా ఈ నగదు జమ చేయనుంది. ఇక్కడ చందాదారులు.. ఎలాంటి క్లెయిమ్ సెటిల్మెంట్ డాక్యుమెంట్స్ గానీ లేదా ఇతర డాక్యుమెంట్స్ గానీ ఇవ్వాల్సిన అవసరం లేదు. పైలట్ ప్రాజెక్ట్ విజయవంతం అయితే.. అప్పుడు మిగతా 25 లక్షల మంది వరకు నిర్వహణలో లేని పీఎఫ్ చందాదారుల ఖాతాల్లోకి కూడా డబ్బును ఆటోమేటిక్‌గా రిఫండ్ చేసేందుకు ఈపీఎఫ్ఓ సన్నాహాలు చేస్తోంది.

## బిజినెస్

### వినియోగదారులకు ఊరట.. భారీగా పడిపోయిన వెండి ధరలు



హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో ఇవాళ ధరలు ఊహించని విధంగా పతనమయ్యాయి. ఒక్క రోజులోనే వెండి కేజీపై ఏకంగా రూ.15,000 తగ్గింది. ఇక బంగారం ధరలు మాత్రం స్వల్ప పెరుగుదలను నమోదు చేశాయి. 24 క్యారెట్ల స్వచ్ఛమైన 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.430 పెరిగి రూ.1,61,780కి చేరింది. ఇక ఆభరణాలలో వినియోగించే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ.400 మేర పెరిగి రూ.1,48,300 వద్ద కొనసాగుతోంది. గత కొన్ని రోజులుగా ఆకాశమే హద్దుగా పెరుగుతూ వచ్చిన వెండి ధర ఇవాళ భారీగా దిగివచ్చింది. నిన్నటి ధరతో పోలిస్తే ఇప్పుడు కేజీ వెండి రూ.2,85,000 వద్ద పలుకుతోంది. వెండి ఆభరణాలు కొనేవారికి, పెట్టుబడిదారులకు ఇది పెద్ద ఊరట అని చెప్పవచ్చు. అంతర్జాతీయ మార్కెట్‌లో చోటుచేసుకుంటున్న పరిణామాల ప్రభావం దేశీయ బులియన్ మార్కెట్‌పై స్పష్టంగా కనిపిస్తోంది. పసిడి ప్రియులు కొనుగోలు చేసే ముందు తాజా ధరలను ఒకసారి సరిచూసుకోవడం మంచిదని బిజినెస్ ఎక్స్‌పర్ట్స్ సూచిస్తున్నారు.

### ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ వ్యవహారంపై స్పందించిన ఆర్‌బీఐ




ప్రముఖ ప్రైవేటు రంగ ఐడీఎఫ్‌సీ బ్యాంకులో జరిగిన రూ. 590 కోట్ల భారీ మోసంపై భారతీయ రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పందించారు. యూనియన్ బడ్జెట్ తర్వాత సాంప్రదాయంగా ఆర్థిక మంత్రితో జరిగే సమావేశం అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకులో జరిగిన ఫ్రాడ్ వ్యవహారంపై, దాని చుట్టూ నెలకొన్న పరిణామాలను గమనిస్తున్నామని, ఇందులో ఎలాంటి వ్యవస్థాగత మోసం జరగలేదని మల్హోత్రా చెప్పారు. హర్యానా ప్రభుత్వానికి చెందిన ఖాతాల్లో బ్యాంకు ఉద్యోగులు, ఇతరులు చేసిన రూ.590 కోట్ల మోసాన్ని ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ ఆదివారం బహిర్గతం చేసిన సంగతి తెలిసిందే. దీనిపై స్పందించిన బ్యాంక్ ఎండీ, సీఈఓ వి.వైద్యనాథన్, బ్యాంకులోని లోపాలను సరిదిద్దడంతో పాటు బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సీనియర్ మేనేజ్‌మెంట్ స్థాయిలో ఎవరికీ ఈ మోసంలో ప్రమేయం లేదని, సాధారణ బ్యాంకింగ్ లావాదేవీలు యథావిధిగా కొనసాగుతాయని తెలిపారు. హర్యానా ప్రభుత్వం ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకు నుంచి మరో బ్యాంకుకు తమ ఖాతాను బదిలీ చేయాలని కోరిన సమయంలో ఈ వ్యవహారం బయటకు వచ్చింది. ప్రభుత్వ రికార్డుల్లో ఉన్న దానికి, బ్యాంక్ స్టేట్‌మెంట్‌లో ఉన్న బ్యాలెన్స్‌కు మధ్య వ్యత్యాసం ద్వారా ఈ ఫ్రాడ్‌ను గుర్తించారు. చండీగఢ్‌లోని బ్రాంచ్‌లో కొందరు ఉద్యోగులు బయటి వ్యక్తులతో కలిసి ఈ మోసం చేసినట్టు తెలుస్తోంది.

## రూ.3 లక్షల కోట్ల ఎగుమతులకు సుంకం వర్తించదా?



ప్రతీకార సుంకాలను రద్దు చేస్తూ అమెరికా సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసినా, వెనక్కి తగ్గని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచ దేశాల ఉత్పత్తులపై 15% సుంకం విధిస్తున్నానని, భారత్‌కూ ఇదే వర్తిస్తుందని తెలిపారు. వాణిజ్య చట్టం- 1974లోని సెక్షన్ 122 కింద ప్రతిపాదించిన టారిఫ్ చర్యల ప్రకారం.. 150 రోజుల వరకు 15% దాకా సుంకాలను అమెరికా అధ్యక్షుడు విధించొచ్చు. అయితే సుమారు 34 బి.డాలర్ల (సుమారు రూ.3 లక్షల కోట్ల)కు పైగా విలువైన భారత ఎగుమతులకు ఈ సుంకం నుంచి మినహాయింపు ఉంటుందని ఆంగ్ల పత్రికలు అంచనా వేశాయి. సుంకాల నుంచి మినహాయింపు ఉండే వాటిల్లో ఔషధాలు, ఎలక్ట్రానిక్స్‌తో పాటు పౌర విమానయాన రంగానికి సంబంధించినవి ఉండొచ్చని సమాచారం. ఇంతకుముందు జపాన్, ఐరోపా కూటమి, యునైటెడ్ కింగ్‌డమ్‌కు కూడా ఈ తరహా మినహాయింపులను అమెరికా పొడిగించింది.
2024లో అమెరికాకు మనదేశ మొత్తం ఎగుమతులు 87.7 బిలియన్ డాలర్లు (సుమారు రూ.8 లక్షల కోట్లు)గా ఉన్నాయి. తాజా అమెరికా సుంకాల నుంచి మినహా యింపు ఉండే భారత ఎగుమతుల్లో.. ఔషధ రంగం ముందు వరసలో ఉండనుంది. ఈ రంగానికి సంబం ధించి 10.6 బిలియన్ డాలర్ల (రూ.95,400 కోట్ల) విలువైన ఎగుమతులకు సుంకం వర్తించకపో వచ్చు. యాంటీబయోటిక్ ఫార్ములేషన్లు, హార్మోన్ల ఆధారిత ఔషధాలు, ఇమ్యునోలాజికల్ ఉత్పత్తుల వంటివి ఇందులో ఉంటాయి.

## అభిమానుల ప్రేమకు ప్రతీకగా కొత్త లోగో.. గరుడ, కిరీటం, ఏనుగు బొమ్మలు ఎందుకంటే..?




ఐపీఎల్‌లో ప్రతిసారి గట్టి పోటీనిచ్చే లక్నో సూపర్ జెయింట్స్ వచ్చే సీజన్‌కు పక్కాగా సిద్ధమవుతోంది. ఇప్పటికే కోచింగ్ యూనిట్‌ను పటిష్టం చేసుకున్న లక్నో.. ఇకపై కొత్త లోగోతో మైదానంలోకి దిగనుంది. లావెండర్ రంగులో లక్నో పట్టణం చరిత్రను ప్రతిబింబించేలా గరుగ్మంతుడు, కిరీటం, ఏనుగు బొమ్మతో రూపొందించిన లోగో ప్రత్యేక ఆకర్షణగా మారింది. ఇంతకూ ఈ లోగోలోని బొమ్మల వెనకున్న మతలబు ఏంటో తెలుసా..? లక్నో ఫ్రాంచైజీ కొత్త లోగో ఉత్తరప్రదేశ్.. లక్నో పట్టణ విశిష్టతను, స్ఫూర్తిగాథను చాటేలా సరికొత్తగా.. అభిమానులకు అమితంగా నచ్చేలా రూపొందించారు. తాజా లోగోలో శక్తివంతమైన గరుడు, కిరీటం, ఏనుగు బొమ్మలు ఉన్నాయి. గరుడ (గరుత్మంతుడు) చిహ్నం ధైర్యానికి ప్రతీక. సవాళ్లను స్వీకరించడం.. వెనక్కి తిరిగి చూడకపోవడం, ఉన్నత శిఖరాలకు చేరడాన్ని సూచిస్తుంది. లక్నో జట్టు అనుసరించే భయమన్నది ఎరుగని క్రికెట్‌ను, సమిష్టిగా ఆడితే అసాధ్యమైన లక్ష్యమంటూ ఉండదని చాటుతుంది.
కిరీటం విషయానికొస్తే దర్పం, బాధ్యతకు ప్రతీక. మైదానంలోకి దిగిన ప్రతిసారి లక్షలాదిమంది ఆశల్ని లక్నో జట్టు మోస్తుంది. లక్నో జెర్సీ ధరించడం ఎంతో గర్వకారణం. ప్రతిరోజు ఈ గౌరవాన్ని పొందాలని కిరీటం సూచిస్తుంది. కొత్త లోగుకు ఏనుగు బొమ్మ గుండెతో సమానం. బలం, తెలివి, ఓపిక, ఐక్యత.. ఈ లక్షణాలకు ప్రతిరూపమే ఏనుగు. ఫలితంతో సంబంధం లేకుండా సీజన్ సీజన్‌కు అభిమానుల నుంచి లభిస్తున్న నిరంతర మద్దతు, వారు చూపించే కృతజ్ఞతా భావానికి బొమ్మ ప్రతీక. క్లుప్తంగా చెప్పాలంటే లక్నో వీధులకు సబంధించిన లోగో ఇది. ఇంట్లో ఉండి క్రికెట్ మ్యాచ్‌లు చూసే కుటుంబాలు, ఏదో ఒకరోజు లక్నో జెర్సీ వేసుకోవాలని ఆశపడే యువతకు ఇది ప్రతిబింబం. కొత్త లోగో.. ఈ ప్రాంత చరిత్ర, గౌరవం, ఐకత్య సందేశాన్ని చాటుతుంది.
ఆర్‌పీఎస్‌జీ గ్రూప్ ఛైర్మన్, లక్నో ఫ్రాంచైజీ యజమాని సంజీవ్ గొయెంకా తమ కొత్త లోగోపై ఏమన్నారంటే.. ‘ఈ కొత్త లోగో మా ఫ్రాంచైజీ భావోద్వేగానికి సంబంధించినది. మొదటి రోజు నుంచి ఉత్తరప్రదేశ్, లక్నో ప్రజలు లక్నో సూపర్ జెయింట్స్‌కు తమ హృదయాల్లో స్థానమిచ్చారు. అభిమానుల నమ్మకం, ప్రేమకు కృతజ్ఞతగా ఈ సింబల్‌ను రూపొందించాం. ఉన్నత స్థానానికి చేరాలనే మా కలకు గరుడ ప్రతీక. మైదానంలోకి దిగిన ప్రతిసారి గర్వపడే ప్రదర్శన చేయాలని కిరీటం సూచిస్తుంది. లక్నో ప్రాంత వైవిధ్యం, ధ్రుఢత్వానికి ఏనుగు సంకేతం. ఈ లోగోను మార్పుకోసమే తీసుకురాలేదు. ఇదొక ప్రామిస్. లక్నో సిటీని, ఇక్కడి మూలాలను మేము ఎంతగా గౌరవిస్తామో ఈ లోగో చెప్పకనే చెబుతుంది. ప్రతి పరుగు, వికెట్, మైదానంలోని ప్రతి క్షణం.. అభిమానుల ఎమోషన్స్‌ను చూపిస్తాయి. ఈ కొత్త లోగో ఇకపై లక్నో జట్టు జెర్సీపై, కిట్లపై, డిజిటల్ ఫ్లాట్‌ఫామ్స్‌లోనూ కనిపించనుంది. మా ఫ్రాంచైజీ అధికారిక ప్రచార సంస్థలు.. కొత్త లోగోతో కొనసాగుతాయి’ అని సంజీవ్ వెల్లడించారు.

### వరుసగా 2 సార్లు ప్లే ఆఫ్స్

ఐపీఎల్‌లో 2022లో అరంగేట్రం చేసిన లక్నో సూపర్ జెయింట్స్ ట్రోఫీ కోసం నిరీక్షిస్తోంది. వరుసగా రెండుసీజన్లు ప్లే ఆఫ్ చేరిన ఎల్ఎస్‌జీ.. 17, 18వ సీజన్లలో నాకౌట్ దశకు ముందే టోర్నీ నుంచి నిష్క్రమించింది. పద్దెనిమిదో సీజన్ వేలంలో రూ. 27 కోట్ల రికార్డు ధరతో రిషభ్ పంత్‌ను కొనుగోలు చేసిన లక్నో.. ఆశించిన ఫలితాన్ని మాత్రం చూడలేదు. పంత్ సారథ్యంలోని ఆ జట్టు మొదట విజయాలతో అదరగొట్టింది. కానీ, చివరకు ఆరు విజయాలతో ప్లే ఆఫ్స్ చేరలేదు. సో.. పంతొమ్మిదో సీజన్‌లో ట్రోఫీపై కన్నేసిన ఫ్రాంచైజీ కోచింగ్ యూనిట్‌ను పటిష్టం చేసుకుంది. కేన్ విలియమ్సన్‌కు వ్యూహాత్మక సలహాదారుగా, టామ్ మూడీకి ‘గ్లోబల్ డైరెక్టర్ ఆఫ్ క్రికెట్’గా కీలక బాధ్యతలు అప్పగించిన లక్నో.. స్పిన్ కోచ్‌గా కార్ల్ క్రోవేను తమ గూటికి తెచ్చుకుంది సంజీవ్ గొయెంకా టీమ్.

### తిలక్ తొందరపడకు.. ఛేజ్‌మాస్టర్ అవ్వాలంటే కోహ్లీలా ఆడు..!



స్వదేశంలో ఫేవరెట్‌గా.. మూడో ప్రపంచకప్ వేటలో దూసుకెళ్తున్న భారత జట్టుకు దక్షిణాఫ్రికా బ్రేకులు వేసింది. ఆల్‌రౌండ్ షోతో టీమిండియాను ఓడించి.. సూర్యకుమార్ యాదవ్ సేన బలహీనతలను బట్టబయలు చేసింది. తుది జట్టులో మార్పులు, టాపార్డర్ వైఫల్యం ప్రధాన కారణాలు కాగా.. ఓ ఎండ్‌లో క్రీజులో పాతుకుపోయే వారే కరువవ్వడం విజయావకాశాల్ని ఘోరంగా దెబ్బతీసింది. వెస్టిండీస్ చేతిలో జింబాబ్వే చిత్తుగా ఓడిన వేళ.. భారత్ సెమీస్ అవకాశాలు మిణుకుమిణుకు మంటున్నాయి. ఈ పరిస్థితుల్లో యువ క్రికెటర్ తిలక్ వర్మకు మాజీ ఆటగాడు మహమ్మద్ కైఫ్ విలువైన సలహా ఇచ్చాడు. పొట్టి ప్రపంచకప్‌లో ఒకేఒక ఓటమి భారత్‌ను పునరాలోచనలో పడేసింది. జట్టు కూర్పు.. ఆటగాళ్ల ఫామ్‌ను బేరీజు వేసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని చెప్పకనే చెప్పింది. వరుసగా విఫలమవుతున్న ఓపెనర్ అభిషేక్ శర్మ, తిలక్ వర్మలపై వేటు వేసి.. సంజూ శాంసన్‌కు అవకాశం ఇవ్వాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఎందుకంటే.. సూపర్ 8లో తొలి ఓవర్లోనే ఇషాన్ కిషన్ ఔట్ కావడంతో బాధ్యతగా ఆడాల్సిన తిలక్.. పొడగరి పేసర్ యాన్సెన్‌ను టార్గెట్ చేయబోయి వికెట్ కీపర్ చేతికి దొరికాడు. అనవసరంగా వికెట్ ఇచ్చేశాడని ఈ యంగ్‌స్టర్‌ను సునీల్ గవాస్కర్ గట్టిగానే విమర్శించాడు. ఇక మహమ్మద్ కైఫ్ తన యూట్యూబ్ ఛానెల్లో మాట్లాడుతూ.. తిలక్‌కు విలువైన సలహాలు ఇచ్చాడు. మూడో స్థానంలో విరాట్ కోహ్లీ మాదిరిగా ఇన్నింగ్స్ నిర్మించాలని యువ బ్యాటర్‌కు బోధించాడు. ‘తిలక్ వర్మకు సొంత స్టయిల్ ఉంది. తక్కువ స్ట్రయిక్ రేటుతోనూ ఆడగలడు. కానీ, పెద్ద షాట్ ఆడే క్రమంలో ఔటవుతున్నాడు. స్ట్రయిక్ రేటు ఒత్తిడి అందుకు ఓ కారణం. ఆటగాడిగా కోచ్, కెప్టెన్ చెప్పిన పని చేయడం చాలా ముఖ్యం. అతడు విరాట్ కోహ్లీ పాత్రను పోషించాలి. కానీ,. సఫారీలతో మ్యాచ్‌లో తన బాధ్యతను మరిచి.. బిగ్ షాట్‌కు యత్నించాడు తిలక్.

## స్పోర్ట్స్

### ‘వాళ్లేం మాల్కం మార్షల్ కాదు’.. హార్దిక్, దూబేపై అక్తర్ సంచలన వ్యాఖ్యలు



టీ20 ప్రపంచకప్-2026లో టీమిండియా సెమీఫైనల్‌కు చేరుతుందా? లేదా? అన్న ఉత్కంఠ అభిమానుల్లో నెలకొంది. ఆదివారం అహ్మదాబాద్ వేదికగా సౌతాఫ్రికాతో జరిగిన సూపర్-8 మ్యాచ్‌లో భారత్ ఘోరంగా ఓడిపోవడంతో పరిస్థితి అంతా తారుమారైంది. గ్రూపు-1 పాయింట్ల పట్టికలో భారత్ మూడో స్థానంలో ఉంది. నెట్‌రన్ రేట్(-3.800) భారీగా పడిపోయింది. దీంతో భారత్ సెమీస్‌కు చేరాలంటే మిగిలిన రెండు మ్యాచ్‌లలో భారీ విజయాలతో పాటు, ఇతర జట్ల ఫలితాలపై కూడా ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే సౌతాఫ్రికాతో మ్యాచ్‌లో బౌలింగ్, బ్యాటింగ్ రెండింటిలోనూ భారత్ విఫలమైంది. 21 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడిన సఫారీలను భారత బౌలర్లు ఆపలేకపోయారు. మిడిల్ ఓవర్లలో భారీగా పరుగులు సమర్పించుకుంటూ ఓటమిలో తమ వంతు పాత్ర పోషించారు. ఈ నేపథ్యంలో భారత బౌలింగ్‌పై పాకిస్తాన్ మాజీ పేసర్ షోయబ్ అక్తర్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. భారత వద్ద సరైన ఫాస్ట్ బౌలర్లు లేరని అక్తర్ అన్నాడు. అదేవిధంగా హార్దిక్ పాండ్యా, శివమ్ దూబేలు ఏమి మాల్కమ్ మార్షల్ వంటి బౌలర్లు కాదని అక్తర్ ఎద్దేవా చేశాడు. “సౌతాఫ్రికాతో మ్యాచ్‌లో భారత బౌలింగ్ పూర్తిగా తేలిపోయింది. సాధారణంగా స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి 97 నుంచి 98 కి.మీ వేగంతో బౌలింగ్ చేస్తాడు. కానీ ఈ మ్యాచ్‌లో 94 కిలోమీటర్ల వేగంతో బౌలింగ్ చేశాడు. అతడిని డెవాల్డ్ బ్రెవిస్ టార్గెట్ చేశాడు. హార్దిక్ పాండ్యా, శివమ్ దూబేలు 120 కిలోమీటర్ల వేగంతో బౌలింగ్ చేస్తున్నారు. వారిద్దరూ ఏమి ప్రత్యర్థి బ్యాటర్లను భయపెట్టే మాల్కమ్ మార్షల్‌లు కారు. డెత్ ఓవర్లలో అటువంటి వారితో బౌలింగ్ చేస్తే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు. ప్రోటీస్‌తో మ్యాచ్‌లో అదే జరిగింది. ఈ మ్యాచ్‌లో పాండ్యా 45 పరుగులు సమర్పించుకున్నాడు” అని ఓ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అక్తర్ పేర్కొన్నాడు.

ప్రతిఘటన
తెలుగు దిన పత్రిక
బుధవారం 25 ఫిబ్రవరి 2026



# ఆ సంఘటన నన్ను ఎంతగానో గాయపరిచింది..

తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో వరుస విజయాలతో దూసుకుపోతుంది యంగ్ హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్. తాజాగా ఒక ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఒక ఆసక్తికరమైన విషయాన్ని వెల్లడించారు. బ్లాక్ బస్టర్ హిట్ 'కార్తికేయ-2' షూటింగ్ సమయంలో జరిగిన ఒక సంఘటన తనను ఎంతగా కలచివేసిందో ఆమె వివరించారు. 'కార్తికేయ-2' షూటింగ్ సమయంలో సెట్స్‌లో ఒక మేకపిల్ల ఉండేదని, దానితో తాను ఎంతో ఇష్టంగా ఆడుకునేదాన్ని అని అనుపమ తెలిపారు. "ఆ మేకపిల్లతో గడపడం నాకు చాలా సంతోషాన్ని ఇచ్చేది. అయితే ఒకరోజు షూటింగ్ గ్యాప్‌లో మాకు మటన్ బిర్యానీ వడ్డించారు. నేను తింటున్న సమయంలో నా అసిస్టెంట్ నా దగ్గరకు వచ్చి నవ్వుతూ.. 'మేడం, మీరు ఇప్పుడు తింటున్నది మీరు ఇందాక ఆడుకున్న మేకపిల్లనే' అని చెప్పాడు" అంటూ ఆనాటి చేదు జ్ఞాపకాన్ని గుర్తు చేసుకున్నారు. అసిస్టెంట్ చెప్పిన మాట వినగానే తాను ఒక్కసారిగా షాక్‌కు గురయ్యానని, వెంటనే వాంతులు చేసుకున్నానని అనుపమ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సంఘటన తనను ఎంతగా గాయపరిచిందంటే.. అప్పటి నుంచి తాను మటన్ ముట్టుకోవడమే మానేశానని తెలిపారు. దాదాపు కార్తికేయ-2 సమయం నుంచి ఇప్పటి వరకు మటన్ జోలికి వెళ్ళలేదని, అయితే ఇటీవల కాలంలోనే మళ్ళీ నెమ్మదిగా తినడం ప్రారంభించానని ఆమె వెల్లడించారు. ప్రస్తుతం ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ విషయం తెలుసుకున్న వారంతా.. మూగజీవాల పట్ల ఆమెకు ఉన్న ప్రేమే ఆమెను అన్ని ఏళ్లపాటు మటన్‌కు దూరంగా ఉంచిందని, అనుపమ సున్నిత మనస్తత్వాన్ని మెచ్చుకుంటున్నారు. ఇక అనుపమ సినిమాల విషయానికొస్తే.. ఇటీవల 'లాక్‌డౌన్' సినిమాతో అలరించిన అనుపమ, ప్రస్తుతం 'క్రేజీ కళ్యాణం' అనే సినిమాలో నటిస్తున్నారు.



## అత్యంత తక్కువ టికెట్ ధరకు హే బల్‌వంత్

కొన్ని సంవత్సరాల వెనక్కి వెళ్లినట్లయితే తెలుగు సినిమా పరిశ్రమలో టికెట్ ధరలు కాస్త తక్కువగా ఉండేవి. అలాగే ఓటీటీల వెసులుబాటు కూడా లేదు.దానితో పెద్ద ఎత్తున ఫ్యామిలీ ఆడియన్స్, యూత్, కామన్ ప్రేక్షకులు కూడా సినిమాను థియేటర్కు వెళ్లి చూసేవారు. దానితో కాస్త మంచి సినిమాలకు సూపర్ వసూళ్లు దక్కడం, యావరేజ్ సినిమాలు కూడా బ్రేక్ ఈవెన్ ను కంప్లీట్ చేసుకునేవి. కానీ కొన్ని సంవత్సరాలుగా స్టార్ హీరోల సినిమాలకు టికెట్ ధరలను భారీగా పెంచుతున్నారు. అలాగే కొంచెం క్రేజ్ ఉన్న సినిమాల టికెట్ ధరలను కూడా అలాగే పెంచేస్తున్నారు. ఇక సినిమా విడుదల అయ్యి నెల తిరగకుండానే ఓటీటీలోకి వచ్చేస్తున్నాయి. దానితో చాలామంది ప్రేక్షకులు అంత డబ్బు పోసి సినిమాను థియేటర్కు వెళ్లి చూడాలా? నెల రోజుల్లోనే ఇంట్లో అంతా కలిసి చూడొచ్చు అనే అభిప్రాయానికి వచ్చేసారు. దానితో స్టార్ హీరోల సినిమాలకు బ్లాక్బస్టర్ టాక్ వచ్చిన సందర్భంలో, మరికొన్ని సినిమాలకు మాత్రమే పెద్ద ఎత్తున కలెక్షన్లు వస్తున్నాయి. చాలా చిత్రాలు బ్రేక్ ఈవెన్ కావడం కష్టంగా మారింది. దానితో చిన్న సినిమాల నిర్మాతలు కొత్త స్ట్రాటజీతో ముందుకు వస్తున్నారు. తమ సినిమాను అత్యంత తక్కువ టికెట్ ధరకు చూడండి అని ఆఫర్లు ఇస్తున్నారు. తాజాగా ఇదే ఫార్ములాను సుహాస్, శివానీ నాగారం జంటగా గోపి అచ్చర దర్శకత్వంలో రూపొందిన హే బల్‌వంత్ మూవీ యూనిట్ కూడా ఫాలో అయ్యింది. తాజాగా ఈ మూవీ బృందం వారు 99 రూపాయలకే రెండు తెలుగు రాష్ట్రాల్లోని మేజర్ స్క్రీన్లలో ఈ సినిమాను ప్రదర్శిస్తున్నట్లు, తక్కువ టికెట్ ధరకు ఈ సినిమాను చూసి ఎంజాయ్ చేయండి అని ఆఫర్ను ఇచ్చారు. మరి ఈ ఆఫర్ సినిమా వసూళ్లపై ఏ స్థాయి ప్రభావాన్ని చూపిస్తుందో చూడాలి.



# ఆ సమయంలో మళ్ళీ ఎవరినైనా నమ్ముతానని అనుకోలేదు..

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత సెకండ్ ఇన్నింగ్స్ స్టార్ట్ చేశారు. గత కొద్ది కాలంగా ఇండస్ట్రీకి దూరంగా ఉన్న ఆమె 'మా ఇంటి బంగారం' సినిమాతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు.ఈ మూవీ పనుల్లో బిజీగా ఉన్నారు. ఈ క్రమంలో.. తాజాగా, ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆమె తన వ్యక్తిగత జీవితం గురించి కొన్ని ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. ముఖ్యంగా నాగచైతన్యతో విడాకుల తర్వాత తన పరిస్థితి ఎలా ఉండేదో, రాజ్ నిడిమోరు పరిచయం తనను ఎలా మార్చిందో ఆమె వివరించారు. "నేను విడాకులు తీసుకున్న సమయంలో చాలా కుంగిపోయాను. నా చుట్టూ ఒక గోడ కట్టుకుని ఎవరినీ రానివ్వలేదు. మళ్ళీ ఎవరినైనా నమ్ముతానని లేదా వేరొకరిపై ఆధారపడతానని అస్సలు ఊహించలేదు. కానీ, రాజ్ అందించిన ప్రేమను, స్నేహాన్ని స్వీకరించే మనస్తత్వం నాకు ఉండటం నా అదృష్టం. రాజ్ లాంటి వ్యక్తి నా జీవితంలో ఉండటం వల్ల నేను ఇప్పుడు ఒక మంచి మనిషిగా మారాను" అని సమంత ఎమోషనల్ అయ్యారు. తనలో వచ్చిన ఈ సానుకూల మార్పును అందరూ గమనిస్తున్నారని, తన పాత స్నేహితురాలు కూడా ఈ విషయాన్ని నేరుగా చెప్పారని సమంత పేర్కొన్నారు. విడిపోయిన ప్రారంభ రోజుల్లో చాలా లో-ఫేజ్‌లో ఉన్న తనకు, రాజ్‌తో ఏర్పడిన స్నేహం జీవితం పట్ల ఉన్న నమ్మకాన్ని మార్చేసిందని ఆమె వెల్లడించారు. 2021లో 'ది ఫ్యామిలీ మ్యాన్ 2' సెట్స్‌లో వీరిద్దరికీ పరిచయం ఏర్పడగా, అది కాలక్రమేణా బలపడి గతేడాది వివాహ బంధానికి దారితీసింది. పెళ్లి చేసుకుని వివాహ బంధంలోకి అడుగుపెట్టిన ఈ జంట తమ పర్సనల్ లైఫ్‌ను ఫుల్ ఎంజాయ్ చేస్తున్నారు.



# అన్నం పెట్టే ఇండస్ట్రీని గౌరవించండి

టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా వెలిగి, ప్రస్తుతం బాలీవుడ్‌లోనూ బిజీగా ఉన్న రకుల్ ప్రీత్ సింగ్, తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొని నటుల బాధ్యతలపై చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి.ఒక నటిగా తన వృత్తి పట్ల తనకు ఎంత గౌరవం ఉందో చెబుతూ, భాష తెలియకుండా నటించే వారిపై ఆమె పరోక్షంగా చురకలు వేశారు. చాలామంది నటీనటులు ఇతర భాషల్లో నటించేటప్పుడు డైలాగులకు బదులుగా కేవలం అంకెలు (1, 2, 3) లేదా 'అఆ' లు చెబుతూ మేనేజ్ చేస్తుంటారు. దీనిపై రకుల్ స్పందిస్తూ.. "నేను స్వతహాగా మోసగత్తెను కాదు. సెట్స్‌లో 1, 2, 3 లేదా అ ఆ అని చెప్పి నా లైన్లను నేను పూర్తి చేయలేను. ఒక పరిశ్రమ మనకు అన్నం పెడుతున్నప్పుడు మనం దాన్ని గౌరవించాలి. మనకు ఇంత ప్రేమను ఇస్తున్నప్పుడు.. కనీసం ఆ భాషను నేర్చుకోవడం మనం చేయాల్సిన కనీస బాధ్యత" అని ఆమె స్పష్టం చేశారు. తనకు ఎలాంటి పాత్రలు చేయాలని ఉందనే విషయంపై రకుల్ మాట్లాడుతూ.. "ఒక నటిగా నాకు విభిన్నమైన, ముఖ్యంగా నెగటివ్ రోల్స్ చేయడమంటే చాలా ఇష్టం. అది చాలా ఆకర్షణీయంగా అనిపిస్తుంది. అయితే ఇందులో ఒక సమస్య ఉంది. మీరు ఒకసారి నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రల్లో కనిపిస్తే, మేకర్స్ మిమ్మల్ని మళ్ళీ 'గర్ల్ నెక్స్ట్ డోర్' (పక్కింటి అమ్మాయి) పాత్రల్లో చూడటానికి ఇష్టపడరు" అని తన ఆవేదన వ్యక్తం చేశారు. ఒక నటిగా పరిపూర్ణత కోసం తాను పడే తపనను వివరించిన రకుల్, భాష ఏదైనా సరే అందులో లీనమై నటించడమే తన విజయ రహస్యమని చెప్పుకొచ్చారు.

PRINTED AND PUBLISHED BY KANUGULA SRINIVAS ON BEHALF OF VIPLAV MEDIA PVT. LTD. AT M/S SMIL YS ONLINE, H-NO : 6-7-48 VANASTHALIPURAM SHOPPING COMPLEX, RANGAREDDY DIST, TELANGANA - 500070 AND PUBLISHED AT VIPLAV MEDIA PVT LTD. H-NO: 18-7-496 KANDIKAL GATE, CHARMINAR, HYDERABAD, TELANGANA - 500053. CEO & CHEIF EDITOR: VANGA NAGARAJU, EDITOR: VANGA VIPLAV. UDYAM- TS-02-0308842 PHONE NO: +919394517067, +918499094183.